కోటగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో..
వీక్షించండి చానల్
NS99 CHANNEL
దగా స్థానంలో నిగా వేసే చానల్

దగా స్థానంలో నిఘా వేసే జాతీయ దిన పత్రిక

నీలగిరి శంఖారావం

సమగ్ర సమాచార దర్శిని

తెలుగు జాతీయ దినపత్రిక

నల్లగొండ | సంపుటి :05 | సంచిక :178 | ఎడిటర్ : కోటగిరి చంద్రశేఖర్ | గురువారం 05-11-2026 | పేజీలు : 4 | వెల : రూ. 3/-

యాదవుల ఐక్యతకు చిహ్నం సదర్ : తలసాని శ్రీనివాస్ యాదవ్



హైదరాబాద్ : యాదవుల ఐక్యతకు చిహ్నం సదర్ అని మాజీమంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం ఎన్టీఆర్ స్టేడియం వద్ద నిర్వహించిన సదర్ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. ఏడాది పొడవునా పాడిపరిశ్రమ పనులలో యాదవులు దీపావళి మరుసటి రోజు ఘనంగా సదర్ ను నిర్వహించుకోవడం ఆనవాయితీ అన్నారు.ఒకప్పుడు హైదరాబాద్ నగరానికే పరిమితమైన సదర్ ను ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా జరుపుకోవడం సంతోషించదగ్గ విషయమని తెలిపారు. రామాయణం, మహాభారతం ఏ చరిత్ర చూసిన యాదవులు లేనిదే లేదు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని మొదటగా తెరిచేది యాదవుడే అని గుర్తు చేశారు. సంఖ్యా పరంగా ఎంతో బలమైన సామాజిక వర్గంగా ఉన్న యాదవులు అంతా ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు.

ఆర్టీసీ కార్మికులపై ప్రయాణికుల దాడులను అరికట్టాలి..

సూర్యాపేట : ఆర్టీసీ కార్మికుల పై ప్రయాణికుల దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చట్టాన్ని తీసుకురావాలని, విధి నిర్వహణలో మహిళా ఉద్యోగులకు పూర్తిభద్రత కల్పించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శులు బత్తుల సుధాకర్, సుంకరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మణుగూరు డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ప్రవళిక పది రోజుల క్రితం ప్రయాణికుల దాడిలో తీవ్రంగా గాయపడి, సాయి సంజీవని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడం అత్యంత బాధాకరమని, ఈ ఘటన యావత్ ఆర్టీసీ కార్మిక వర్గాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ప్రవళిక మృతికి నిరసనగా, ఆమె కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సూర్యాపేట ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మృతురాలి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు ప్రజలకు నిరంతరం రవాణా సేవలు అందిస్తూ విధులు నిర్వహిస్తున్నప్పటికీ, వారి ప్రాణాలకు కనీస రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మహిళా కండక్టర్లు విధి నిర్వహణలో ప్రయాణికుల నుంచి వేధింపులు, దాడులు, అనేక రకాల అభద్రతా పరిస్థితులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. మహిళా ఉద్యోగుల రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు.ప్రవళిక మృతి కేవలం ఒక కుటుంబానికి జరిగిన నష్టం మాత్రమే కాదని, కార్మికుల భద్రతపై తీవ్ర ఆందోళన



కలిగించే ఘటన అని పేర్కొన్నారు. మరోవైపు ఆర్టీసీ కార్మికులు ఉద్యోగ భద్రత లేక, రోజురోజుకూ పెరుగుతున్న పని భారంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా సరిపడా బస్సులు అందుబాటులో లేకపోవడంతో ఉన్న సిబ్బందిపై అదనపు పని భారం పడుతోందని అన్నారు. కార్మికులకు అవసరమైన విశ్రాంతి, భద్రత, సౌకర్యాలు కల్పించడంలో యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూయూ డిపో కార్యదర్శి భాస్కర్, ఎస్.డబ్ల్యూ.ఎఫ్. కోశాధికారి ఏర్పుల వెంకన్న, యల్లయ్య, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, టీ.డబ్ల్యూ.యు. నాయకులు, టీ.ఎం.యు. డిపో కార్యదర్శి లచ్చయ్య, ఈ.యు. అధ్యక్షులు సేవ్యా, రమేష్, మల్లయ్య, రామచంద్రు, ఉపేందర్, ముస్తఫా, యూసుఫ్, నరేష్, మంజుల, సువర్ణ, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి తెలంగాణకు శనిలా దాపురించాడు.. జీవన్ రెడ్డి ఫైర్



హైదరాబాద్, మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతుల కోసం ఒత్తిడి పెరుగుతుండటంతోనే సీఎం రేవంత్‌రెడ్డి తుమ్మిడిహట్టి ప్రాజెక్టుపై నిద్రలేచినట్లు నటిస్తున్నారని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి టి. జీవన్‌రెడ్డి విమర్శించారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి అపాయింట్‌మెంట్ కోసం మూడు నెలల సమయం వృథా చేశారని, డీపీఆర్ లేకుండానే చర్చలకు ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. ఇదంతా కాలయాపన కోసమేనని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నేత డాక్టర్ కురువ విజయ్‌కుమార్‌తో కలిసి జీవన్‌రెడ్డి మాట్లాడారు.తుమ్మిడిహట్టి ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి ఆశ్చర్యం కలిగిస్తోందని జీవన్‌రెడ్డి అన్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రితో సమావేశం కోసం మూడు నెలలు ఎదురుచూశారని, తీరా డీపీఆర్ లేకుండానే చర్చలకు వెళ్లారని విమర్శించారు. ముంపునకు సంబంధించిన పరిహారాన్ని మహారాష్ట్ర జాయింట్ అకౌంట్‌లో జమ చేస్తామనడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్లడం లేదని, కాలయాపనకే ప్రాధాన్యం ఇస్తోందని ఆరోపించారు.రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే తుమ్మిడిహట్టి పనులు ప్రారంభించి ఉంటే ఈపాటికి ప్రాజెక్టు పూర్తయ్యేదని అన్నారు. కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి ప్రాజెక్టు విషయంలో అనుసరించిన వ్యూహాన్నే తెలంగాణ ప్రభుత్వం తుమ్మిడిహట్టి విషయంలో అనుసరించాలని సూచించారు. 152 మీటర్ల వద్ద శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించాలని, ఆ తర్వాత ఎంత ఒప్పందం కుదిరితే దానికి కట్టుబడి ముందుకు సాగాలని పేర్కొన్నారు.కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద 20 వేల క్యూసెక్కుల ప్రవాహం ఉన్నప్పటికీ ప్రభుత్వం నీటిని ఎత్తిపోయడంపై దృష్టి పెట్టడం లేదని జీవన్‌రెడ్డి విమర్శించారు. తక్షణమే కన్నెపల్లి పంప్‌హౌస్‌ను వినియోగించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కాఫర్ డ్యామ్ నిర్మాణం చేపట్టాలని మొత్తుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. తాత్కాలిక వ్యూహంలో భాగంగా ఈ పనులు చేపడితే శాశ్వత ప్రాతిపదికన చేపట్టే మరమ్మతులకు ఎలాంటి అడ్డంకి ఉండదని స్పష్టం చేశారు.కన్నెపల్లి నుంచి ఒక్క టీఎంసీ నీటిని ఎత్తిపోసుకునే అవకాశం ఉన్నా ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. మొత్తం 150 టీఎంసీల నీటిని ఎత్తిపోయడానికి వీలున్నా మొద్దు నిద్రపోతోందని విమర్శించారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు గోదావరి నదిపై ఉండగా, మేడిగడ్డ ప్రాణహిత నదిపై ఉందని వివరించారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు సురక్షితంగానే ఉన్నాయని, కన్నెపల్లి నుంచి నీటిని ఎత్తిపోసినా వాటికి ఎలాంటి నష్టం ఉండదని పేర్కొన్నారు.

కేటీఆర్ బౌన్సర్ వ్యాఖ్యలకు బండి కౌంటర్



హైదరాబాద్, తనను ఉద్దేశించి బౌన్సర్ అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలతు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కేటీఆర్‌ను 'ట్విట్టర్ టిల్లు'గా సంబోధిస్తూ సంచలన కౌంటర్ ఇచ్చారు. "మీది మేనేజ్‌మెంట్ కోటా.. మాది మెరిట్ కోటా" అని స్పష్టం చేస్తూ, తండ్రి కేసీఆర్ పేరు చెప్పుకుని రాజకీయాల్లోకి వచ్చి పదవులు అనుభవించిన చరిత్ర కేటీఆర్‌ది అని ఎద్దేవా చేశారు. తాము జనం కోసం కష్టపడి, లాఠీదెబ్బలు తిని, సుదీర్ఘ ఉద్యమాలు చేసి కార్యకర్త స్థాయి నుంచి ఈ స్థాయికి వచ్చామని వ్యాఖ్యానించారు.

మా పార్టీ శ్రేణులను కంట్రోల్ చేస్తే బౌన్సర్‌లా కనిపిస్తున్నానా?

హైదరాబాద్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొన్న పాదయాత్రకు విపరీతమైన కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారని, ఆ జనాన్ని కంట్రోల్ చేయడానికి వెళ్తే బౌన్సర్ అంటూ హేళన చేస్తావా? అని బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మా పార్టీ క్రౌడ్‌ను సరిచేయడానికి వెళ్తే మేము బౌన్సర్లలా కనిపిస్తున్నామా? సొంత కార్యకర్తలపై బౌన్సర్లతో దాడులు చేయించిన సంస్కృతి బీఆర్ఎస్‌ది. అధికారంలో ఉన్నంత కాలం కార్యకర్తలను గాలికి వదిలేసిన చరిత్ర మీది అని మండిపడ్డారు.

మియాపూర్ భూములను అమ్మి కప్పం కడుతున్నారు:

తెలంగాణ భూములను అమ్మి దోచుకున్న ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని సంజయ్ ఆరోపించారు. ఆనాడు ప్రజలకిచ్చిన హామీలను కేసీఆర్ సర్కార్ గాలికి వదిలేసిందని, మియాపూర్ భూములను సైతం అడ్డికి పావుశేరుకు అమ్మి కేసీఆర్ కుటుంబం దోచుకోవాలని చూసిందన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కూడా బీఆర్ఎస్ బాటలోనే నడుస్తోందని విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారెంటీలను పక్కనపెట్టి మియాపూర్ భూములను తెగనమ్మి ఢిల్లీ పెద్దలకు కప్పం కట్టేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిద్ధమవుతోందని ఆరోపించారు.

మానవతా దృక్పథంతో వ్యవహరించాలి:

ఇటీవల చోటుచేసుకున్న ఘటనలో తోపులాట జరిగి ఆర్టీసీ కండక్టర్ ప్రవళిక మరణించడం అత్యంత బాధాకరమని బండి సంజయ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న కోపంతో ప్రయాణికులు ఆర్టీసీ కార్మికులపై పగ తీర్చుకునే ప్రయత్నం చేయవద్దు. అనేక ఇబ్బందుల్లో ఉండి కూడా ఆర్టీసీ ఉద్యోగులు ఎంతో ఓపికతో సేవలు అందిస్తున్నారు. రిటైర్ అయ్యాక పెన్షన్ కూడా లేక వారు దుర్భర జీవితం అనుభవిస్తున్నారు. ప్రతిరోజూ కోటి మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్న ఘనత వారిది. క్లిష్ట పరిస్థితుల్లోనూ పనిచేస్తున్న ఆర్టీసీ సిబ్బంది పట్ల ప్రజలందరూ మానవతా దృక్పథంతో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు అక్షరజ్ఞానం పునాది : మంత్రి జూపల్లి కృష్ణారావు



పాన్‌గల్ : మహిళల ఆర్థిక స్వావలంబనకు అక్షరజ్ఞానం పునాది అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని తెల్లరాళ్లపల్లి గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలు అక్షరాస్యులైనప్పుడే ఆత్మవిశ్వాసంతో పాటు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మహిళలు విద్యావంతులైతే కుటుంబం, సమాజం మరింత అభివృద్ధి చెందుతాయని అన్నారు. ప్రతి ఒక్కరికీ చదవడం, రాయడం రావాలన్నదే తన ఆకాంక్ష అని పేర్కొన్నారు.మండలంలోని తెల్లరాళ్లపల్లి గ్రామంలో నిరక్షరాస్య మహిళలు చదువు నేర్చుకునేందుకు మంత్రి పలకలు, బలపాలు పంపిణీ చేశారు. వీటి కొనుగోలుకు సంబంధించి గతంలోనే మంత్రి జూపల్లి కృష్ణారావు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. మహిళలకు అక్షరజ్ఞానం అందించడంతో ఈ కార్యక్రమం ఆగిపోకుండా నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని సూచించారు. ఇందులో భాగంగా గ్రామంలోని మహిళలకు ప్రతిరోజూ ఉదయం గంట, సాయంత్రం గంట చొప్పున చదువు నేర్పించేందుకు ఉపాధ్యాయులను నియమించాలని సర్పంచ్ జంబలయ్యకు సూచించారు. ఇందుకు తన వంతు సహాయంగా రూ.20 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. చదువుకు వయసుతో సంబంధం లేదని పేర్కొన్నారు.మహిళల్లో చదువుపై ఆసక్తిని పెంపొందించేందుకు మరో ప్రోత్సాహకాన్ని ప్రకటించారు. చదవడం, రాయడం ముందుగా నేర్చుకునే మహిళకు రూ.5 వేల నగదు బహుమతి అందజేస్తామని మంత్రి ప్రకటించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కార్తీక్ రావు, ఎంపీడీవో గోవిందరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్ నాయుడు, మాజీ జెడ్పీటీసీ రవికుమార్, సింగిల్ విండో మాజీ ఉపాధ్యక్షుడు ముంత భాస్కర్ యాదవ్, విండో డైరెక్టర్ ఉస్మాన్, కాంగ్రెస్ నాయకులు రాము యాదవ్, బ్రహ్మయ్య, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజకీయంగా కొండా ఫ్యామిలీ దారెటు.. మళ్లీ పాత గూటికేనా..?



తెలియదు కానీ.. కొండా సురేఖ పార్టీ, ప్రభుత్వం కార్యక్రమాలకు అటెండ్ కాకపోవడం చర్చనీయాంశం అవుతోంది. మంత్రివర్గం నుంచి బర్తరఫ్ అయ్యాక.. వారం రోజుల పాటు జరిగిన అసెంబ్లీ సమావేశాలకు కూడా దూరంగా ఉన్నారు. పార్టీ తరపున చేపట్టే ఏ కార్యక్రమంలోనూ పాల్గొనడం లేదు.ఎస్ఐఆర్ విషయంలో పార్టీ అనేక కార్యక్రమాలు చేపట్టినా ఎక్కడా కూడా పాల్గొనలేదామె. ఏఐసీసీ పిలుపు మేరకు చేపట్టిన రాజ్ భవన్ ముట్టడి కార్యక్రమాల్లో కూడా పాల్గొనలేదు. ఆఖరికి ఢిల్లీలో రామ్ లీలా మైదానంలో చేపట్టిన ధర్నా కార్యక్రమానికి కూడా వెళ్లలేదు కొండా సురేఖ. ఇలా పార్టీ చేపట్టే ఏ ఒక్క కార్యక్రమంలో కూడా పాల్గొనడం లేదు. చివరాఖరికి ప్రజాభవన్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహిస్తే కూడా మీటింగ్‌కు దూరంగా ఉన్నారు. ఇలా కొండా సురేఖ సైలెంట్గా ఉండటంపై పొలిటికల్ సర్కిల్స్‌లో గుసగుసలు మొదలయ్యాయి.

హైదరాబాద్, తెలంగాణ పొలిటిక్స్‌లో కొండా ఫ్యామిలీ రూటే సపరేటు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో తమదైన ముద్ర వేసిన కొండా ఫ్యామిలీ.. ఇప్పుడు పొలిటికల్ సర్కిల్‌లో సరికొత్త చర్చకు దారి తీస్తుంది. కొండా సురేఖ కూతురు కొండా సుస్మిత.. నేరుగా సీఎం రేవంత్ రెడ్డి ఫ్యామిలీని టార్గెట్ చేసి విమర్శలు గుప్పించడం.. ఆ తర్వాత మంత్రి పదవి నుంచి కొండా సురేఖ బర్తరఫ్‌కు గురికావడం చకచకా జరిగిపోయాయి. మంత్రి పదవి కోల్పోయిన తర్వాత కొండా సురేఖ పూర్తిగా సైలెంట్ అయిపోయారు. కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతానని రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యం అని చెప్పుకొచ్చిన ఆమె.. ఆ తర్వాత ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఢిల్లీ వెళ్లి కలిసి వచ్చారు. ఆమెకు కీలక పదవి దక్కబోతుందన్న ప్రచారం కూడా నడిచింది. ఆ తర్వాత ఏమైందో ఏమో



కండక్టర్ ప్రవళిక కుటుంబానికి ప్రభుత్వం అండ..



హైదరాబాద్: విధి నిర్వహణలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఆర్టీసీ మహిళా కండక్టర్ ప్రవళిక కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం కొండంత అండగా నిలిచాయి. ఉస్మానియా ఆసుపత్రి మార్చురీ వద్ద ప్రవళిక పార్థివదేహానికి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి నివాళులర్పించారు. అనంతరం ప్రవళిక తల్లిని పరామర్శించారు. ప్రభుత్వం, ఆర్టీసీ.. వారి వెంటే ఉంటుందని ధైర్యం చెప్పారు.ప్రభుత్వం, ఆర్టీసీ అందించే సహాయం: సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రవళిక కుటుంబానికి ప్రభుత్వం, ఆర్టీసీ తరఫున కింది సహాయాన్ని మంత్రి ప్రకటించారు. రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఆర్టీసీ ప్రమాద భీమా ఒప్పందం ప్రకారం బ్యాంక్ ద్వారా రూ. 1 కోటి పరిహారం అందజేయనున్నట్లు మంత్రి తెలిపారు. అదేవిధంగా ప్రవళిక తల్లికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. కండక్టర్ ప్రవళికను కోల్పోవడం ఆర్టీసీ కుటుంబానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఘటన జరిగిన వెంటనే ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స అందించినప్పటికీ దురదృష్టవశాత్తూ ఆమె ప్రాణాలు కాపాడలేకపోయామన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన నిందితులపై ఇప్పటివరకు ఉన్న 'హత్యాయత్నం' కేసును ఇప్పుడు 'హత్య కేసు'గా మార్చి చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామని మంత్రి పొన్నం స్పష్టం చేశారు.ప్రయాణికులకు సేవలు అందించడమే కాకుండా కార్మికుల సంక్షేమం, భద్రత తమ ప్రభుత్వ ప్రాధాన్యత అని మంత్రి తెలిపారు. సిబ్బంది ప్రవర్తనలో ఏమైనా పొరపాట్లు ఉంటే ఉన్నతాధికారులకు లేదా చట్టానికి ఫిర్యాదు చేయాలి తప్ప, నేరుగా చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని దాడులకు పాల్పడటం సరికాదని హితవు పలికారు. ఒకరి ఆగ్రహం వల్ల ఇవాళ ఒక కుటుంబం రోడ్డున పడిందని.. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజాపాలన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్టీసీ కార్మికుల పెండింగ్ సమస్యలన్నింటినీ పరిష్కరిస్తూ వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని పొన్నం వెల్లడించారు. ఆర్టీసీ సిబ్బంది కూడా ప్రయాణికులను దేవుళ్లతో సమానంగా భావించి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.

సంపాదకీయం

గురువారం 05-11-2026

హక్కుల సంరక్షణే ప్రగతికి మార్గం

ఒక దేశ ఆర్థిక వ్యవస్థ వినియోగదారులపైనే ఆధారపడి ఉంటుంది. వారు లేనిదే ఉత్పత్తి, వ్యాపారాలు, ఉద్యోగాలు, ప్రభుత్వాలకు ఆదాయం లాంటివేవీ ఉండవు. దేశ ప్రగతి ప్రమాదంలో పడకూడదంటే– వినియోగదారుల హక్కులకు రక్షణ కల్పించడం అత్యావశ్యకం. గతంలో వినియోగదారుల జీవనశైలి ప్రధానంగా స్థానిక అవసరాలు, అక్కడి వ్యాపార సంబంధాలు, ప్రత్యక్ష కొనుగోళ్లపై ఆధారపడి ఉండేది. ఉదాహరణకు రైతు పండించిన పంటను దగ్గరిలోని సంతలో విక్రయించేవాడు. పారిశ్రామిక విప్లవం, పట్టణీకరణ, అంతర్జాతీయ వాణిజ్యం, ప్రకటనల విస్తరణతో మార్కెట్ స్వరూప స్వభావాలు మారిపోయాయి. ఆన్‌లైన్‌లో విక్రయాలు కొన్నేళ్లుగా విరివిగా పెరిగాయి. వినియోగదారు అవసరాలే మార్కెట్ విస్తరణకు పునాది. కాబట్టి వినియోగదారును కేవలం వస్తువులు కొనుగోలు చేసే వ్యక్తిగా మాత్రమే చూడకూడదు. అభివృద్ధి ప్రక్రియలో అత్యున్నతస్థానంలో ఉన్న హక్కులు కలిగిన పౌరులుగా వినియోగదారులను గుర్తించాలి. అందువల్ల వారి ప్రయోజనాలను కాపాడే వ్యవస్థే నిజమైన ప్రజాస్వామిక ఆర్థిక వ్యవస్థ. వినియోగదారుల హక్కులను రక్షించడం ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత.

జవాబుదారీగా ఉండాల్సిందే...

ఆహారం, దుస్తులు, నివాసం వంటి ప్రాథమిక అవసరాలు మొదలు విద్య, వైద్యం, రవాణా, బ్యాంకింగ్, బీమా, డిజిటల్ సేవల వంటి ప్రతి రంగ పురోగతిలో వినియోగదారుల పాత్ర నేడు కీలకంగా మారింది. అందువల్ల వారి ప్రయోజనాలను కాపాడటం సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం, ప్రజాస్వామ్య పరిపాలనతో ముడిపడిన అంశం. వినియోగదారుల ప్రయోజనాల పరిరక్షణ విషయంలో ప్రపంచ వ్యాప్తంగా చైతన్యం పెరిగిన నేపథ్యంలో భారతదేశంలోనూ చట్టబద్ధమైన రక్షణ వ్యవస్థ అభివృద్ధి చెందింది. దేశీయంగా 1986లో అమలులోకి వచ్చిన వినియోగదారుల పరిరక్షణ చట్టాన్ని మారుతున్న మార్కెట్ అవసరాలకు అనుగుణంగా బలోపేతం చేశారు. ఆ క్రమంలో రూపొందించిన వినియోగదారుల చట్టం–2019 మరుసటి సంవత్సరం జులై నుంచి అమల్లోకి వచ్చింది. ఈ చట్టం వినియోగదారుల హక్కులను వ్యక్తిగత వివాదాల పరిధిలోనే కాకుండా సమూహ ప్రయోజనాల దృష్టితోనూ పరిరక్షించేందుకు వ్యవస్థను బలోపేతం చేసింది. కొన్నేళ్లుగా ప్రజల అవసరాల్లో చాలా మార్పులొచ్చాయి. ఆన్‌లైన్ కొనుగోళ్లు, ఈ–కామర్స్, టెలీమార్కెటింగ్, డిజిటల్ ఆర్థిక లావాదేవీల విస్తరణతో వినియోగదారు మార్కెట్ విపరీతంగా విస్తరించింది. ఈ క్రమంలో ఆన్‌లైన్ వ్యాపారాల్లో మోసాలు పెరిగి పోతున్నాయి. వాటికి తగినట్లుగా సంబంధిత కమిషన్ల పనితీరును కూడా అదే స్థాయిలో మెరుగుపరచాల్సిన అవసరం ఏర్పడింది. రాజీ ద్వారా వివాదాలను పరిష్కరించేందుకు మధ్యవర్తిత్వానికి కూడా చట్టం అవకాశం కల్పించింది. వినియోగదారుల చట్టాన్ని సంక్షేమ శాసనంగా పరిగణించి ప్రభుత్వ సంస్థలైనా, వైద్యసేవలు అందించే కంపెనీలైనా జవాబుదారీగా ఉండాల్సిందేనని సుప్రీంకోర్టు సైతం ఒక కేసు విచారణ సందర్భంగా స్పష్టం చేసింది. భారత రాజ్యాంగంలో ఆర్టికల్–21 పరిధిని న్యాయస్థానాలు విస్తృతంగా వ్యాఖ్యానించిన నేపథ్యంలో వినియోగదారుల గౌరవప్రదమైన జీవితం, ఆరోగ్యం, భద్రత వంటి అంశాలు ప్రాధాన్యం పొందాయి.

భారీగా ఖాళీలు

వినియోగదారుల హక్కులకు భరోసా దక్కాలంటే సంబంధిత కమిషన్లలో ఖాళీలను ఎప్పటికప్పుడు భర్తీ చేయడం తప్పనిసరి. కానీ, ఆ దిశగా తగిన చర్యలు కొరవడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం మొన్న మార్చిలో రాజ్యసభలో వెల్లడించిన వివరాల ప్రకారం, రాష్ట్రస్థాయి వినియోగదారు వివాద పరిష్కార కమిషన్లలోని మొత్తం 36 అధ్యక్ష పోస్టుల్లో 19 ఖాళీగానే ఉన్నాయి. వాటన్నింటిలో కలిపి మొత్తం 167 మెంబర్ పోస్టులు ఉండగా, 79 మంది సభ్యులను నియమించాల్సి ఉంది. ఇక జిల్లాస్థాయి కమిషన్లలోనూ ఇటువంటి పరిస్థితే నెలకొంది. వాటిలోని 669 అధ్యక్ష పోస్టుల్లో 260, మొత్తం 1,402 సభ్య స్థానాల్లో 556 ఖాళీగానే ఉన్నాయి. దీనివల్ల కేసుల విచారణ, పరిష్కార ప్రక్రియపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉంది. ఈ దుస్థితిని నివారించాలంటే అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు వినియోగదారుల కమిషన్లలో ఖాళీలన్నింటినీ తక్షణం భర్తీ చేయాలి. వినియోగదారులు ఇంటి నుంచే ఫిర్యాదులు చేసేలా 'ఈ–దాఖల్' పోర్టల్‌ను మరింత సులభతరం చేయాలి. వారి విలువైన సమయం, ఖర్చులు ఆదా కావాలంటే కమిషన్ల కార్యాలయాలకు రావాల్సిన అవసరం లేకుండా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణలను ప్రోత్సహించాలి. నిర్దేశిత కాలపరిమితిలోగా కేసులు కొలిక్కి వచ్చేలా తగిన చర్యలు తీసుకోవాలి. కమిషన్ల తీర్పులను కంపెనీలు, వ్యాపారులు కచ్చితంగా అమలు చేసేలా చూడాలి. అన్నిచోట్లా మధ్యవర్తిత్వ కేంద్రాలు చురుగ్గా పనిచేసేలా జాగ్రత్తలు తీసుకోవాలి. వినియోగదారుల హక్కులపై, తమకు అన్యాయం జరిగితే కమిషన్లను ఎలా ఆశ్రయించాలన్నదానిపై అన్నిచోట్లా విస్తృతంగా అవగాహన కల్పించడమూ అత్యావశ్యకం.

కవిత ఎమ్మెల్సీ పోటీతో లాభం ఎవరికి? కాంగ్రెస్‌కా... బీఆర్ఎస్‌కా?

హైదరాబాద్,తెలంగాణ రాజకీయాల్లో మరో ఆసక్తికరమైన పరిణామం చోటుచేసుకుంది. ఇంతకాలం అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్ష బీఆర్ఎస్ మధ్య సాగుతున్న రాజకీయ పోరులోకి కల్వకుంట్ల కవిత నేతృత్వంలోని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) ప్రవేశించడంతో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు కొత్త రాజకీయ చర్చకు తెరలేపాయి. రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలకు తమ పార్టీ అభ్యర్థులను ప్రకటించడం ద్వారా కవిత ప్రత్యక్ష ఎన్నికల రాజకీయాల్లో తన పార్టీ బలాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించగా, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కవిత రాజకీయంగా ఎవరికి సవాల్‌గా మారబోతున్నారు? ఆమె పోటీ వల్ల కాంగ్రెస్‌కు నష్టమా? బీఆర్ఎస్‌కు ఇబ్బందా? లేక కొత్త రాజకీయ శక్తిగా ఎదిగేందుకు తెలంగాణ రక్షణ సేనకు ఇది అవకాశమా? అన్న చర్చ రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా సాగుతోంది.

రెండు స్థానాల్లోనూ బరిలోకి కవిత పార్టీ

రాష్ట్రంలోని రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలపై కవిత ప్రత్యేకంగా దృష్టి సారించారు. వరంగల్–ఖమ్మం–నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి డాక్టర్ సలమాస శ్రీకాంత్ గౌడ్‌ను, తాజాగా హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి సీనియర్ జర్నలిస్టు ఆకాష్ కొల్లూరును అభ్యర్థులుగా ప్రకటించారు.రెండు స్థానాల్లోనూ బీసీ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులను ఎంపిక చేయడం ద్వారా కవిత ఒక స్పష్టమైన రాజకీయ సందేశాన్ని ఇచ్చే ప్రయత్నం చేశారు. సామాజిక న్యాయం, బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం, నిరుద్యోగులు, పట్టభద్రుల సమస్యలను ప్రధాన అజెండాగా తీసుకెళ్లాలన్నది ఆమె వ్యూహంగా కనిపిస్తోంది. రెండు స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించడంతో పాటు నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జిలు, ఎన్నికల సమన్వయకర్తలను నియమించడం ద్వారా ఎన్నికల కార్యాచరణకు శ్రీకారం చుట్టారు.

కాంగ్రెస్‌కు కవిత రూపంలో కొత్త చిక్కు?

అధికార కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే రెండు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ స్థానానికి సామ రామ్మోహన్‌రెడ్డిని, వరంగల్–ఖమ్మం–నల్గొండ స్థానానికి రామిరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డిని బరిలోకి దించింది.అయితే రెండు స్థానాల్లోనూ ఒకే సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థులను ప్రకటించడంపై కవిత విమర్శలు గుప్పించారు. రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలను ఒకే సామాజిక వర్గానికి కేటాయించడం సామాజిక న్యాయానికి విరుద్ధమని ప్రశ్నించారు.ఇప్పుడు అదే అంశాన్ని ఎన్నికల ప్రచారంలో ప్రధానంగా ప్రస్తావించే అవకాశం ఉంది. బీసీ సామాజిక ప్రాతినిధ్యాన్ని రాజకీయ అస్త్రంగా మలుచుకుంటే కాంగ్రెస్‌కు ఇబ్బందికరమైన ప్రశ్నలు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా పట్టభద్రుల్లో సామాజిక న్యాయం, ఉద్యోగ అవకాశాలు, విద్యారంగ సమస్యలపై చర్చను ముందుకు తీసుకెళ్లాలని కవిత భావిస్తున్నట్లు తాజా పరిణామాలు సూచిస్తున్నాయి.అయితే కాంగ్రెస్‌కు క్షేత్రస్థాయిలో ఉన్న పార్టీ యంత్రాంగం, అధికారంలో ఉండటం, అభ్యర్థుల వ్యక్తిగత పరిచయాలు వంటి అంశాలు కూడా ఎన్నికల్లో కీలకం కానున్నాయి.

బీఆర్ఎస్ ఓటు బ్యాంకుపై ప్రభావం ఉంటుందా?

కవిత రాజకీయ అడుగులు బీఆర్ఎస్‌కు కూడా కీలకమైన సవాల్‌గా మారుతున్నాయి. గతంలో బీఆర్ఎస్‌లో కీలక నేతగా ఉన్న కవిత ఇప్పుడు సొంత రాజకీయ పార్టీని స్థాపించి ప్రత్యక్ష ఎన్నికల బరిలోకి దిగడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.బీఆర్ఎస్‌కు సంప్రదాయంగా ఉన్న కొన్ని సామాజిక, ప్రాంతీయ వర్గాల్లో కవిత తన పార్టీకి మద్దతు కూడగట్టగలరా? ముఖ్యంగా యువత, పట్టభద్రులు, బీసీ వర్గాల్లో తనకంటూ ప్రత్యేక రాజకీయ గుర్తింపు తెచ్చుకోగలరా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఒకవేళ కవిత పార్టీకి బీఆర్ఎస్‌కు మద్దతుగా ఉండే కొన్ని వర్గాల నుంచి ఆదరణ లభిస్తే, అది బీఆర్ఎస్ ఓటు సమీకరణాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. మరోవైపు బీఆర్ఎస్ నాయకత్వం కూడా ఈ ఎన్నికలను సాధారణ ఎమ్మెల్సీ పోటీగా కాకుండా తమ రాజకీయ ప్రాబల్యాన్ని చాటుకునే అవకాశం ఉంది.అయితే కవిత పార్టీకి బీఆర్ఎస్ ఓటు బదిలీ అవుతుందా? లేక ఆమెకు స్వతంత్రంగా కొత్త మద్దతు వర్గం ఏర్పడుతుందా? అనేది ఎన్నికల ఫలితాల కంటే ముందే రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఓట్ల చీలికేనా?



ఈ ఎన్నికల్లో ప్రధానంగా చర్చ జరుగుతున్న అంశం ఓట్ల చీలిక. ఇప్పటివరకు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ మధ్య పోటీగా భావించిన గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కవిత పార్టీ ప్రవేశంతో మరో రాజకీయ ప్రత్యామ్నాయం తెరపైకి వచ్చింది.కవిత పార్టీకి పట్టభద్రుల్లో గణనీయమైన మద్దతు లభిస్తే, ప్రధాన పార్టీల సంప్రదాయ ఓటు సమీకరణాల్లో మార్పులు చోటుచేసుకోవచ్చు. కాంగ్రెస్‌పై అసంతృప్తిగా ఉన్న ఓటర్లు, బీఆర్ఎస్‌తో విభేదిస్తున్న వర్గాలు, కొత్త రాజకీయ ప్రత్యామ్నాయం కోసం చూస్తున్న పట్టభద్రులు కవిత పార్టీ వైపు మొగ్గు చూపుతారా అన్నది చూడాలి. మరోవైపు బీజేపీ కూడా ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. ముఖ్యంగా హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ పరిధిలో పట్టభద్ర ఓటర్లను ఆకర్షించేందుకు ప్రధాన పార్టీలు ప్రయత్నించనున్నాయి. దీంతో పోటీ బహుముఖంగా మారే అవకాశముంది.

కవితకు అసలైన పరీక్ష ఇదే!

రెండు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించడం ఒక ఎత్తయితే, వారిని గెలిపించుకునే స్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని నిర్మించడం మరో ఎత్తు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు ఇప్పటికే నియోజకవర్గాల వారీగా కార్యకర్తలు, నాయకులు, ఎన్నికల అనుభవం ఉన్నాయి. కొత్తగా రాజకీయ కార్యాచరణ ప్రారంభించిన తెలంగాణ రక్షణ సేనకు మాత్రం పట్టభద్రుల స్థాయిలో బలమైన నెట్‌వర్క్‌ను నిర్మించుకోవాల్సిన అవసరం ఉంది.అంతేకాదు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల నమోదు అత్యంత కీలకం. అర్హులైన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించడం, వారి సమస్యలను గుర్తించడం, పోలింగ్ వరకు వారిని సమన్వయం చేయడం వంటి అంశాలు ఫలితాలపై ప్రభావం చూపుతాయి. ఈ విషయంలో కవిత పార్టీ ఎంత సమర్థంగా పనిచేస్తుందన్నది ప్రధాన పరీక్షగా నిలవనుంది.అభ్యర్థుల ఎంపికతో పాటు ఓటర్ల నమోదు కూడా పార్టీలకు కీలకంగా మారింది. ఎవరు ఎక్కువ మంది అర్హులైన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించగలరు? ఎవరు ఎక్కువ మందిని పోలింగ్ కేంద్రాలకు తీసుకురాగలరు? అన్నదానిపైనే ఎన్నికల పోరులో కీలక అంశాలు ఆధారపడనున్నాయి.

చివరకు లాభం ఎవరికి?

కవిత రెండు ఎమ్మెల్సీ స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండింటికీ రాజకీయంగా కొత్త పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్‌కు సామాజిక ప్రాతినిధ్యంపై ప్రశ్నలు ఎదురవుతుండగా, బీఆర్ఎస్‌కు తమ మాజీ నాయకురాలి కొత్త రాజకీయ ప్రస్థానం నుంచి సవాల్ ఎదురవుతోంది. మరోవైపు బీజేపీ కూడా తన ఓటు సమీకరణాలను కాపాడుకోవాల్సి ఉంటుంది.కవితకు మాత్రం ఈ ఎన్నికలు తన పార్టీకి ప్రజల్లో ఎంత ఆదరణ ఉందో తెలుసుకునే తొలి ముఖ్యమైన అవకాశంగా మారాయి. రెండు స్థానాల్లోనూ పోటీ చేయడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పార్టీ ఉనికిని చాటుకోవడంతో పాటు, భవిష్యత్తు రాజకీయాలకు పునాది వేసుకోవాలని ఆమె ప్రయత్నిస్తున్నారు.అయితే కవిత పోటీ వల్ల కాంగ్రెస్‌కు ఎంత నష్టం? బీఆర్ఎస్‌కు ఎంత ప్రభావం? అన్నది ఇప్పుడే తేల్చలేని అంశం. పట్టభద్రుల ఓటింగ్ ప్రాధాన్యతలు, అభ్యర్థుల వ్యక్తిగత బలం, పార్టీల క్షేత్రస్థాయి యంత్రాంగం, ఓటర్ల నమోదు వంటి అంశాలే అసలు రాజకీయ చిత్రాన్ని స్పష్టం చేయనున్నాయి. ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు రెండు స్థానాల భర్తీకి పరిమితమైన పోటీ మాత్రమే కాదు. కాంగ్రెస్ పాలనపై పట్టభద్రుల అభిప్రాయానికి, బీఆర్ఎస్ రాజకీయ ప్రాబల్యానికి, కవిత కొత్త పార్టీ భవిష్యత్తుకు ఒకేసారి పరీక్షగా నిలవనున్నాయి. అందుకే ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఒకటే ఆసక్తికరమైన ప్రశ్న.. కవిత రంగంలోకి దిగితే రాజకీయంగా లాభపడేదెవరు? నష్టపోయేదెవరు? రాజకీయ ఆసక్తి నెలకొంది.

ముంరసుతో నీటి కష్టాలకు చెక్...



గుంటూరు, మురసు తుఫానుతో రాష్ట్రంలో రాయలసీమ, పల్నాడు జిల్లాలలో నీటి లోటు తీరే పరిస్థితి కనిపిస్తోంది. నెల్లూరు సమీపంలో తీరందాటనున్న మురసు కారణంగా దక్షిణకోస్తా, రాయలసీమల్లో విస్తారంగా వర్షాలు కురుస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. పల్నాడు జిల్లాలో 30 సెంటీమీటర్లు, ప్రకాశంలో 24, మార్కాపురంలో 19, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో 9 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. అదేవిధంగా ఏలూరులో 9 సెం.మీ., నెల్లూరులో 9 సెం.మీ. మేర వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయన్నారు. భారీ వర్షాల కారణంగా నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టులకు 30 టీఎంసీల నుంచి 50 టీఎంసీల వరకు నీటి ప్రవాహాలు రావచ్చని అంచనా వేస్తున్నారు. పులిచింతలలో 18 టీఎంసీల మేర ఫ్లడ్ కుషన్ అందుబాటులో ఉండగా, నాగార్జునసాగర్‌కు కూడా భారీగా ప్రవాహాలను తట్టుకునే పరిస్థితి ఉందని చెబుతున్నారు. గుండ్లకమ్మ ప్రాజెక్టుకు 1.5 లక్షల క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లో రావచ్చని అంచనా వేస్తున్నారు. ఇక తుఫాను హెచ్చరికలు, భారీ వరదలపై అంచనాలతో అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు అప్రమత్తం చేశారు. తుఫాన్ నేపథ్యంలో ఢిల్లీ పర్యటనను రద్దు చేసుకున్న సీఎం చంద్రబాబు సోమవారం ఉదయం నుంచి సెక్రటేరియట్ లో రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీలో తిష్ట వేశారు. అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ తగిన సూచనలు జారీ చేస్తున్నారు. భారీ వర్షాలు కురిసే ప్రాంతాల్లో డ్రెయినేజీలను ముందుగానే శుభ్రం చేయాలని, వాగులు, వంకలు పొంగి ప్రవహించే ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, మార్కాపురం జిల్లాల్లో వర్షపాతం లోటు ఉన్నందున చెరువులు, రిజర్వాయర్‌లను నింపాలని సూచించారు. అర్నాబ్ కంటే తక్కువ ప్రభావం కోస్తాంధ్ర తీరంపై మురసు తుఫాను ప్రభావం తక్కువగానే ఉండే అవకాశం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబుకు అధికారులు తెలిపారు. అర్నబ్ తుఫానుతో పోలిస్తే గాలులు, వర్ష తీవ్రత కూడా తక్కువగానే ఉన్నట్టు అంచనాలు ఉన్నాయని వివరించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. తుపాను ప్రభావంతో వచ్చే వర్షాలను సమర్థంగా వినియోగించుకుని చెరువులు, రిజర్వాయర్‌లను నింపాలని సూచించారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. మురసు తుఫాను గాలుల ప్రభావం దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లోని సుమారు 8 వేల విద్యుత్ స్తంభాలపై పడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. విద్యుత్ పునరుద్ధరణ కోసం చెన్నై నుంచి మరో వెయ్యి మంది సిబ్బంది వస్తున్నారని, వారిని నెల్లూరు, ప్రకాశం సహా వివిధ జిల్లాల్లో వినియోగించాలని సీఎం సూచించారు. చెరువులకు గండ్లు పడకుండా చర్యలు మురసు తుఫాను ప్రభావం ఉన్న 6 జిల్లాల పరిధిలోని 6,800 చెరువుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సాగునీటి సంఘాలను క్రియాశీలం చేసి ప్రజల భాగస్వామ్యంతో చెరువుల పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. జలధార కార్యక్రమం కింద చేపట్టిన పనులను వినియోగించుకోవాలని, ఎక్కడా చెరువులకు గండ్లు పడకుండా చూడాలని స్పష్టం చేశారు. డ్రెయినేజీలో పూడిక కారణంగా పంటలు ముంపునకు గురికాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. తుపాను ప్రభావిత జిల్లాల్లో గర్భిణులను ముందుగానే ఆసుపత్రుల్లో చేర్పించాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే 3,066 మంది గర్భిణీలను తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కచ్చా ఇళ్లలో నివసించే వారిని పునరావాస కేంద్రాలకు తరలించాలని, అవసరమైన నిత్యావసర వస్తువులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను అవసరాన్ని బట్టి మోహరించాలన్నారు. రైల్వే మార్గాలు, జాతీయ రహదారుల వద్ద లోతట్టు ప్రాంతాల్లో వరద ముప్పు ఉంటే రాకపోకలను నియంత్రించాలని ఆదేశించారు. మత్స్యకారుల బోట్లు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రెండు గంటలకు ఒకసారి బులెటిన్ వర్షాలు, గాలులు, వరద ప్రవాహాలపై నిరంతరం పర్యవేక్షించాలని, సమాచార వ్యవస్థకు అంతరాయం కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రతి రెండు గంటలకు ఓ సారి పరిస్థితిని సమీక్షించి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భరోసా కల్పించాలని, కలెక్టర్లు ఎప్పటికప్పుడు హెచ్చరికల ప్రకటనలు విడుదల చేయాలని చెప్పారు.

ఆంధ్రప్రదేశ్‌లో రూ. 2,254 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ హైవే..

ఆంధ్రప్రదేశ్ ఏపీలో మరో నేషనల్ హైవే విస్తరణకడప టు రేణిగుంట గ్రీన్‌ఫీల్డ్ హైవేతిరుపతికి త్వరగా వెళ్లొచ్చుఆంధ్రప్రదేశ్‌లో నేషనల్ హైవేలు, రోడ్లపై కేంద్రం ఫోకస్ పెట్టింది.. కేంద్రం సహకారంతో హైవే విస్తరణ ప్రాజెక్టుల్ని చేపట్టారు. కడప టు చెన్నై హైవేలో కొన్నేళ్లుగా వాహనాల రద్దీ పెరిగింది. రైల్వేకోడూరు నుంచి రేణిగుంట వరకు దాదాపు 50 కిలోమీటర్ల రోడ్డు దెబ్బతింది. శేషాచలం అడవి, ప్రమాదకర మలుపులు ఉండటంతో ప్రమాదాలు జరిగేవి. అందుకే కడప టు చెన్నై హైవేను రెండు వరసలు నుంచి నాలుగు వరుసులుగా విస్తరించాలని ఐదేళ్ల క్రితం నిర్ణయించింది. అయితే పనులు మాత్రం ప్రారంభంకాలేదు.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పనులు మళ్లీ ప్రారంభమయ్యాయి. ఎన్‌హెచ్–716లో కడప– రేణిగుంట సెక్షన్ గ్రీన్‌ఫీల్డ్ హైవేగా నిర్మిస్తున్నారు. మొత్తం122 కిలోమీటర్లకు గాను అంచనా వ్యయం రూ. 2,254 కోట్లుగా ఉంది.కేంద్రం నేషనల్ హైవే 716కి అనుసంధానంగా కడప నుంచి రేణిగుంట గ్రీన్‌ఫీల్డ్ హైవేకి ప్లాన్ చేసింది. ఈ రోడ్డు అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ తగ్గించొచ్చని భావించారు. కడప, భాకరాపేట, ఒంటిమిట్ట, రాజంపేట, పుల్లంపేట, ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు, మామండూరు మీదుగా రేణిగుంట వరకు నాలుగు లైన్లుగా హైవేను నిర్మిస్తోంది. ప్రస్తుతం ఈ రోడ్డులో కడప నుంచి రేణిగుంట వెళ్లేందుకు నాలుగు గంటల సమయం పడుతోంది. ఈ హైవే విస్తరణ పూర్తయితే కేవలం రెండు గంటల్లో వెళ్లొచ్చంటున్నారు. అలాగే వాహనాల రద్దీ తగ్గి ప్రమాదాల సంఖ్య కూడా తగ్గుతుందని భావిస్తున్నారు. అలాగే ప్రజా రవాణాతో పాటుగా వ్యవసాయ, వాణిజ్య రంగాలకు ఉపయోగంగా ఉంటుందంటున్నరు.2021లోనే కేంద్రం ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే విస్తరణకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.. 2024 వరకు అసలు పనులు ప్రారంభించలేదు. కేంద్రంతో సంప్రదింపులు జరపకపోవడంతో పాటుగా అటవీశాఖ అనుమతులు రావడంలేదన్న కారణాలతో పనులు పక్కన పెట్టారు. 2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2025 అక్టోబరులో పనులు ప్రారంభించారు.. రెండేళ్లలో ఈ పనులు పూర్తి చేయాలన్న టార్గెట్ పెట్టుకున్నారు. అటవీ శాఖ అనుమతులతో పాటుగా నిధుల విడుదల, భూసేకరణ, పరిహారం పంపిణీ పూర్తి చేశారు. ప్రస్తుతం కడప జిల్లాలో పనులు స్పీడ్ అందుకున్నాయి. అలాగే రైల్వేకోడూరు నుంచి రేణిగుంట వరకు అటవీ భూమిలో చెట్ల తొలగింపు కొనసాగుతోంది. ఈ హైవే అందుబాటులోకి వస్తే తిరుపతి, చెన్నై వెళ్లేవారికి కూడా ఎంతో ఉపయోగంగా ఉంటుంది. కడప నుంచి రేణిగుంటకు.. అక్కడి నుంచి తిరుపతికి రెండున్నర గంటల్లోనే వెళ్లొచ్చన్నారు. మొత్తానికి 2027 నాటికి ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల్ని పూర్తి చే?యలనే లక్ష్యంతో పనుల్ని మరింత వేగవంతం చేశారు.

అసైన్డ్, ఇనాం, చుక్కల భూముల ఫ్రీహోల్డ్ దరఖాస్తులపై కీలక జీవో

విజయవాడ, అసైన్డ్, చుక్కల, ఇనాం, పట్టా భూములపై వచ్చే ఫ్రీ హోల్డ్ దరఖాస్తుల విషయంలో ఏపీ ప్రభుత్వం కొత్త జీవో జారీ చేసింది. ఇలాంటి భూములకు సంబంధించిన ఫ్ రీహోల్డ్ దరఖాస్తులు వెంట వెంటనే పరిష్కరించే విధంగా కాలపరిమితిని విధించింది. దీని ప్రకారం ఆర్డీవో పరిధిలో దరఖాస్తులకు 60 రోజుల్లో అధికారులు పరిష్కారం చూపాల్సి ఉంటుంది. నిర్దిష్ట కేటగిరీ దరఖాస్తులను 30 రోజుల్లో పరిష్కరించాలి. అదేవిధంగా తహసీల్దార్ స్థాయిలో దరఖాస్తుల పరిష్కారానికి 60 రోజుల సమయం తీసుకొవచ్చని సూచించింది. ఈ మేరకు ప్రభుత్వం జీవో 659 జారీ చేయడం జరిగింది.రాష్ట్రంలోని అసైన్డ్, చుక్కల, ఇనాం, పట్టా భూముల సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారి కోసం ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఏళ్ల తరబడి పరిష్కారం కానీ ఈ భూముల ఫ్రీ హోల్డ్ దరఖాస్తుల పరిష్కారంపై రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఫ్రీహోల్డ్ కోసం రైతులు చేసుకునే దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా.. నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని అధికారులకు కచ్చితమైన డెడ్‌లైన్లు విధించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 659ను అధికారికంగా రిలీజ్ చేసింది.ఈ కొత్త జీవో ప్రకారం ఆర్డీవో పరిధిలోకి వచ్చే ఫ్రీ హోల్డ్ దరఖాస్తులను ఎక్కువలో ఎక్కువగా రెండు నెలల్లోపు అంటే 60 రోజుల్లోపు కచ్చితంగా పరిష్కరించాల్సి ఉంటుంది. అదేవిధంగా కొన్ని నిర్దిష్ట కేటగిరీలకు చెందిన అప్లికేషన్లను కేవలం నెల రోజుల్లోనే క్లియర్ చేయాలని ప్రభుత్వం అధికారులకు కచ్చితమైన గడువును నిర్దేశించింది. ఇక తహసీల్దార్ స్

డిసెంబర్ లో ఏపీ కేబినెట్ పునర్వ్యవస్థీకరణ !

విశాఖపట్టణం,స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ముగిసిన వెంటనే ఏపీ కేబినెట్ పునర్వ్యవస్థీకరణ ఉంటుందనే ప్రచారం ఊపందుకుంది. ప్రధానమైన మున్సిపల్ ఎన్నికలు ముగియడం, రెండు రోజుల్లో జడ్పీ, మండల పరిషత్ ఎన్నికలు కూడా పూర్తికానున్నాయి. అదేవిధంగా ఈ నెల 26, 28 తేదీలతోపాటు డిసెంబరు 2న మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో రాష్ట్రంలో ఎన్నికల ప్రహసనం ముగియనుంది. ఇక 2029 ఎన్నికలే టార్గెట్ గా ప్రభుత్వం పనిచేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు డిసైడ్ అయ్యారని అంటున్నారు. డిసెంబరు 2న పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముగిసిన తర్వాత రాష్ట్ర మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించాలని సీఎం భావిస్తున్నారని పెద్ద ఎత్తున ఊహాగానాలు వినిపిస్తున్నాయి. 2024 జూన్ లో రాష్ట్ర ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు వచ్చే డిసెంబరుతో రెండున్నరేళ్ల పాలన పూర్తి చేసుకుంటారు. ఇంకా రెండున్నరేళ్ల పాలన మిగిలివున్నప్పటికీ చివరి సంవత్సరం పూర్తిగా ఎన్నికలకే అంకితం చేయాల్సివుంటుందని అంటున్నారు. అంటే ఇంకా గట్టిగా ఏడాదిన్నర మాత్రమే ప్రభుత్వం పూర్తిస్థాయిలో పనిచేయనుందని, ఈ కారణంగా గత రెండున్నరేళ్ల పాలనను పునఃసమీక్షించుకోవడంతోపాటు లోపాలను సరిదిద్దుకునేందుకు వచ్చే ఏడాదిన్నర కాలం వినియోగించుకోవాలని సీఎం భావిస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో ఒకవైపు రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులు తమ బాధ్యతలను ఎలా నిర్వహిస్తున్నారో కూడా పర్యవేక్షిస్తున్నారని చెబుతున్నారు. గత ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచిన కూటమి పార్టీలలో చాలా మంది మంత్రి పదవులను ఆశిస్తున్నారు. ఇందులో కొందరికి తొలివిడతలో అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి త్వరలో విస్తరణ చేపట్టి ఎన్నికల జట్టును సిద్ధం చేయాలని భావిస్తున్నారని చెబుతున్నారు. అయితే ప్రస్తుత మంత్రివర్గంలో ఉన్నవారిలో కొందరిని తప్పించి వారి స్థానంలో కొత్తవారిని తీసుకోవాలనే ఆలోచన చేస్తున్నారనే ప్రచారం హీట్ ఎక్కిస్తోంది. ముఖ్యంగా ప్రతిపక్షం వైసీపీకి గట్టి పునాదులు ఉన్న రాయలసీమ, పల్నాడు జిల్లాల్లో కొత్తవారికి అవకాశం ఇవ్వనున్నట్లు చెబుతున్నారు. రాయలసీమలో ప్రస్తుతం ఏడుగురు మంత్రులు ఉండగా, ఒకరిద్దరు తప్ప మిగిలిన వారు ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదని, వారితో ఎన్నికలకు వెళితే పార్టీకి పెద్దగా ప్రయోజనం ఉండదని సీఎం భావిస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ముఖ్యంగా ప్రస్తుతం మంత్రులుగా ఉన్నవారు సొంత నియోజకవర్గం, జిల్లాల్లో వ్యతిరేకత ఎదుర్కొంటుండటంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా ఆలోచిస్తున్నారని చెబుతున్నారు. ప్రస్తుత మంత్రివర్గంలో చాలా మంది కొత్తవారికి అవకాశం ఇవ్వడం కూడా ఈ పరిస్థితికి కారణంగా సీఎం భావిస్తున్నట్లు చెబుతున్నారు. దీంతో త్వరలో చేపట్టే మంత్రివర్గ విస్తరణలో అనువజ్ఞులను తీసుకోవాలన్న ప్రతిపాదనను సీరియస్ గా పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. ప్రధానంగా రాయలసీమ జిల్లాల్లో వైసీపీని కంట్రోల్ చేసే నాయకుల కోసం సీఎం అన్వేషిస్తున్నారని చెబుతున్నారు. స్థానిక ఎన్నికల ఫలితాలను చూసి మంత్రులు, కొత్తగా మంత్రి పదవులు ఇచ్చే నేతలపై ఒక అవగాహనకు రావాలని సీఎం భావిస్తున్నారని అంటున్నారు. తమ జిల్లాలతోపాటు ఇంచార్జులుగా వ్యవహరిస్తున్న జిల్లాల్లో ఫలితాలను బేరీజు వేసి మంత్రుల పనితీరుపై అంచనాకు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. అదేసమయంలో ప్రత్యర్థిపై పైచేయి సాధించేలా వ్యూహరచన చేసిన నేతల సామర్థ్యాన్ని పరిశీలనకు తీసుకోవాలని, అటువంటి వారికి సముచిత గౌరవం కల్పించాలని సీఎం ఆలోచిస్తున్నారని అంటున్నారు. దీంతో జడ్పీ, మండల పరిషత్ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించేలా మంత్రులు, ఎమ్మెల్యేలు పోటాపోటీగా పనిచేస్తున్నట్లు టీడీపీ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి.

కేంద్ర ఉద్యోగులకు పెరగనున్న డీఏ

న్యూఢిల్లీ,కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. కరువు భత్యం , కరువు ఉపశమనంలను 3 శాతం పాయింట్లు పెంచేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో ఉద్యోగుల డీఏ, పింఛనుదారుల డీఆర్ 60 శాతం నుంచి 63 శాతానికి పెరగనున్నాయి. దాదాపు 50 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 68 లక్షల మంది పింఛనుదారులు ప్రయోజనం పొందనున్నారు.డీఏ పెంపు ఉద్యోగుల ప్రాథమిక వేతనంపై ఆధారపడి ఉంటుంది. అంటే ప్రాథమిక వేతనంలో 3 శాతం పాయింట్ల మేరకు అదనపు భత్యం లభిస్తుంది. ఉదాహరణకు, రూ. 18,000 బేసిక్ పే ఉన్న ఉద్యోగికి ప్రస్తుతం 60 శాతం డీఏ ప్రకారం రూ. 10,800 లభిస్తోంది. కొత్త రేటు 63 శాతానికి చేరితే ఈ మొత్తం రూ. 11,340 అవుతుంది. అంటే నెలకు అదనంగా రూ. 540 అందుతుంది. అలాగే, రూ. 35,400 ప్రాథమిక వేతనం ఉన్న ఉద్యోగికి నెలకు రూ. 1,062 అదనంగా లభిస్తుంది. రూ. 50,000 బేసిక్ పే ఉన్న ఉద్యోగికి నెలవారీ డీఏ రూ. 30,000 నుంచి రూ. 31,500కు పెరుగుతుంది. దీంతో నెలకు రూ. 1,500 అదనపు ప్రయోజనం కలుగుతుంది.మోదీ సర్కార్ నిర్ణయం వల్ల కేంద్ర ప్రభుత్వ పింఛనుదారులకూ ప్రయోజనం కలుగుతుంది. వారి అర్హతగల ప్రాథమిక పింఛనుపై డీఆర్ 60 శాతం నుంచి 63 శాతానికి పెరుగుతుంది. దీంతో నెలవారీ పింఛను ఆదాయంలో పెరుగుదల ఉంటుంది.డీఏ, డీఆర్ పెంపుతో కేంద్ర ప్రభుత్వంపై ఏడాదికి సుమారు రూ. 10,016 కోట్ల అదనపు ఆర్థిక భారం పడనున్నట్లు సమాచారం. పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల ప్రభావాన్ని తగ్గించి, ఉద్యోగులు, పింఛనుదారులకు ఆర్థిక ఊరట కల్పించడం ఈ నిర్ణయం ఉద్దేశమని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.సాధారణంగా కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రెండుసార్లు జనవరి 1, జూలై 1 తేదీల నుంచి అమలయ్యేలా డీఏ, డీఆర్ రేట్లను సవరిస్తుంది. అయితే తాజా పెంపు అమలు తేదీ, బకాయిల చెల్లింపుపై తుది స్పష్టత కోసం అధికారిక ప్రభుత్వ ఉత్తర్వులను జారీ చేసింది.

వ్యవసాయానికి సోలార్ పంపుసెట్లు..

హైదరాబాద్, రాష్ట్రంలో సాగుకు సోలార్ పంపుసెట్లను అందించనున్నట్టు రెడ్‌కో సీఎండీ జితేశ్ వీ పాటిల్ వెల్లడించారు. ఇప్పటికే మంజూరైన సోలార్ పంపుసెట్ల బిగింపు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. టీజీ రెడ్‌కో వీసీ, ఎండీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన ఆ సంస్థ అధికారులు, జిల్లా మేనేజర్లతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పునరుత్పాదక ఇంధన పథకాల అమలును వేగవంతం చేసి గడువులోగా పూర్తిచేయాలని సూచించారు. మాడల్ సోలార్ విలేజ్, రూఫ్‌టాప్ సోలార్, పీఎం కుసుమ్ పథకం, వ్యవసాయ పంపుసెట్ల సోలరైజేషన్, ఎలక్ట్రికల్ వాహన చార్జింగ్ స్టేషన్లపై ఆయన ఆరా తీశారు. గృహజ్యోతి ఇండ్లపై సోలార్ ప్లాంట్లురూఫ్‌టాప్ సోలార్ పథకంలో భాగంగా గృహజ్యోతి పథకం కింద నిర్మించిన ఇండ్లపై విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటు చేయాలని రెడ్‌కో సీఎండీ జితేశ్ వీ పాటిల్ ఆదేశించారు. ప్లాంట్ల ఏర్పాటుతో కలిగే ప్రయోజనాలపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఆసక్తి చూపిన వారి ఇండ్లపై ప్లాంట్ల ఇన్‌స్టాలేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. పీఎం కుసుమ్ లక్ష్యాల సాధనకు జిల్లా స్థాయిలో ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.

సమీక్షలతోనే సరి.. అమలేది?..సీఎం ఆదేశాలు బుట్టదాఖలు



హైదరాబాద్ : హైదరాబాద్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్లీన్ సిటీగా, ట్రాఫిక్ ఫ్రీ సిటీగా తీర్చిదిద్దుతామంటూ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి చేస్తున్న సమీక్షలు, ఇస్తున్న ఆదేశాలు క్షేత్రస్థాయిలో మాత్రం ఆశించిన ఫలితాలను ఇవ్వడం లేదు. సమావేశాలు జరుగుతున్నాయి.. ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి.. అధికారులకు హెచ్చరికలు జారీ అవుతున్నాయి.. కానీ ప్రజలకు మాత్రం చెత్త కుప్పలు, దుర్వాసన, ట్రాఫిక్ నరకం, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలే స్వాగతం పలుకుతున్నాయి. పాలకుల లక్ష్యాలకు, అధికార యంత్రాంగం పనితీరుకు మధ్య భారీ అంతరం కనిపిస్తోంది. ముఖ్యంగా జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి మూడు మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో సమన్వయ లోపాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. సీఎం సమీక్షల్లో చెప్పిన మాటలు కాగితాలకే పరిమితమవుతున్నాయంటూ ప్రజలు ఆక్రోశిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాల్సిన అధికారులు ఉదాసీనత ప్రదర్శిస్తున్నారంటూ ప్రజలు మండిపడుతున్నారు.

రాంకీ రిపోర్టుల బండారం బట్టబయలు

నగరంలో చెత్త సేకరణ, తరలింపు బాధ్యతలు నిర్వహిస్తున్న రాంకీ సంస్థ పనితీరుపై మొదటి నుంచీ విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంటింటికీ చెత్త సేకరణ నుంచి గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల (జీవీపీ) క్లియరెన్స్ వరకు సంస్థ పనితీరును పర్యవేక్షించాల్సిన అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేయకపోవడం ప్రశ్నార్థకంగా మారింది. చెత్త తొలగించినట్లు ఆన్‌లైన్ డ్యాష్‌బోర్డులో నమోదు చేయడం, వాస్తవంగా అక్కడ చెత్త తొలగించడం మధ్య వ్యత్యాసాలు తాజాగా వెలుగులోకి రావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఇటీవల మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి ఉప్పల్‌లోని ఆదర్శనగర్ ప్రాంతంలో నిర్వహించిన ఆకస్మిక తనిఖీలు ఈ వ్యవహారాన్ని బట్టబయలు చేశాయి. తొలుత రాంకీ ఆన్‌లైన్ డ్యాష్‌బోర్డును పరిశీలించిన కమిషనర్‌కు వాహనాల జీపీఎస్ వివరాలు, రోజువారీ ట్రిప్పులు, చెత్త తరలింపు, జీపీఎస్ క్లియరెన్స్ రికార్డుల్లో కనిపించాయి. ఒకే ప్రాంతంలో తీసిన ఫొటోలను వేర్వేరు ప్రాంతాల్లో చెత్త తొలగించినట్లు చూపించేందుకు ఉపయోగించినట్లు తనిఖీల్లో బయటపడింది.ఒక నిమిషం వ్యవధిలోనే ఒక వాహనం రెండు ట్రిప్పులు పూర్తి చేసినట్లు నమోదు కావడం, విధులకు హాజరుకాని డ్రైవర్ పేరుతో క్లియరెన్స్ వివరాలు కనిపించడం వంటి అంశాలపై కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీంతో ఆన్‌లైన్ లెక్కలకే పరిమితమవకుండా వాస్తవ పరిస్థితులను పరిశీలించాల్సిన అవసరం ఎంత ఉందో స్పష్టమైంది. ప్రతి జీపీపీని ప్రత్యేకంగా జీపీఎస్ ద్వారా గుర్తించాలని, రోజువారీగా చెత్త తొలగించాలని, తగినన్ని వాహనాలను వినియోగించాలని కమిషనర్ ఆదేశించారు. అంతేకాకుండా ప్రతిరోజూ ఉదయం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి డ్యాష్‌బోర్డు వివరాలను క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోల్చాలని ఆయన రాంకీ ప్రతినిధులను హెచ్చరించారు.

సమీక్షలకే పరిమితమా.. చర్యలేవి?

ముఖ్యమంత్రి స్థాయిలో పారిశుద్ధ్యంపై పదేపదే సమీక్షలు జరుగుతున్నప్పటికీ, కింది స్థాయి అధికారుల పనితీరులో మార్పు ఎందుకు రావడం లేదన్నది ప్రధాన ప్రశ్న. రాంకీ సంస్థ నిర్లక్ష్యంపై ఆరోపణలు వస్తున్నప్పుడు సంబంధిత ఏసీ, జోనల్ కమిషనర్లు, డిప్యూటీ మున్సిపల్ కమిషనర్లు, పారిశుద్ధ్య విభాగం అధికారులు ఎందుకు కఠినంగా వ్యవహరించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. కాంట్రాక్టు నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు విధించడం, షోకాజ్ నోటీసులు జారీ చేయడం, పనితీరు ఆధారంగా బిల్లుల్లో కోతలు విధించడం వంటి చర్యలు తీసుకునేందుకు అధికారులు భయపడుతున్నారన్న వార్తలు వినిపిస్తున్నాయి. సంస్థకు రాజకీయ, అధికార వర్గాల అండదండలు ఉన్నాయన్న ప్రచారం అధికారుల్లో భయం పుట్టుకొంది.

చెత్త లెక్కల్లో తేడా.. ప్రజాధనానికి గండి

నగరంలో రోజువారీగా ఎంత చెత్త ఉత్పత్తి అవుతోంది? ఎంత సేకరిస్తున్నారు? ఎంత తరలిస్తున్నారు? ఎన్ని వాహనాలు తిరుగుతున్నాయి? ఎన్ని ట్రిప్పులు వాస్తవంగా పూర్తవుతున్నాయి? డ్యాష్‌బోర్డులో నమోదైన వివరాలకు, వేయింగ్ బ్రిడ్జి వద్ద నమోదయ్యే బరువులకు పొంతన ఉందా? అన్న అంశాలపై సమగ్ర ఆడిట్ నిర్వహించాలన్న డిమాండ్ వ్యక్తమవుతోంది. సేకరణ, తరలింపు లెక్కల్లో భారీ వ్యత్యాసాలు ఉన్నాయన్న ఆరోపణల నేపథ్యంలో మూడు కార్పొరేషన్ల పరిధిలో రాంకీ సంస్థ సమర్పించిన బిల్లులు, వాహనాల జీపీఎస్ ట్రాకింగ్, ట్రిప్పుల వివరాలు, డంపింగ్ యార్డుల వద్ద నమోదైన బరువులను స్వతంత్రంగా తనిఖీ చేయాలని. లెక్కల్లో తేడాలు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాఫిక్ ఫ్రీ సిటీ మాటలకేనా..

మరోవైపు నగరాన్ని ట్రాఫిక్ ఫ్రీగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి పలుమార్లు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ట్రాఫిక్ అధికంగా ఉండే ప్రాంతాలను గుర్తించి అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్లు, స్కైవాక్‌లు, మల్టీలెవల్ పార్కింగ్ వంటి ప్రత్యామ్నాయాలపై ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. అయినప్పటికీ అనేక ప్రధాన కూడళ్లలో వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. సిగ్నళ్ల వద్ద నిమిషాల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి కొనసాగుతోంది. రహదారుల విస్తరణ, ఆక్రమణల తొలగింపు, పార్కింగ్ నియంత్రణ వంటి అంశాల్లో సమన్వయ చర్యలు కొరవడుతున్నాయన్న విమర్శలున్నాయి.

అమీర్‌పేట నుంచి పంజాగుట్ట వరకు ఆక్రమణల రాజ్యం

అమీర్‌పేట చౌరస్తా నుంచి పంజాగుట్ట చౌరస్తా వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా వ్యాపార సంస్థలు, దుకాణాల కార్యకలాపాలతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని చోట్ల ఫుట్‌పాత్‌లు, రహదారి అంచులు వ్యాపార అవసరాలకు వినియోగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. చిన్న వ్యాపారులకు స్థలాలు కేటాయించే పేరుతో కొందరు వ్యక్తులు నెలవారీగా డబ్బులు వసూలు చేస్తున్నారన్న విమర్శలూ ఉన్నాయి. మరోవైపు పార్కింగ్ సౌకర్యం లేని హోటళ్లు, వాణిజ్య సముదాయాలకు అనుమతులు ఎలా లభిస్తున్నాయన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వాహనదారులు రహదారులపైనే వాహనాలను నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య మరింత జటిలమవుతోంది.

మదీనా ప్రాంతంలో అరకిలోమీటరుకు అరగంట

పాతబస్తీలోని మదీనా ప్రాంతంలో హోటళ్లు, వాణిజ్య సంస్థల వద్ద రహదారులపైనే వాహనాలను నిలిపివేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా అరకిలోమీటరు దూరం ప్రయాణించడానికి కూడా దాదాపు అరగంట పడుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రద్దీ సమయాల్లో ట్రాఫిక్ పోలీసుల నియంత్రణ, అక్రమ పార్కింగ్‌పై చర్యలు, వ్యాపార సంస్థలకు పార్కింగ్ నిబంధనల అమలు వంటి అంశాలు సమర్థంగా నిర్వహించాల్సి ఉంది.

ఫుట్‌పాత్‌లపై నర్సరీలు.. నడిచే దారి ఎక్కడ?

కూకట్‌పల్లి నుంచి మియాపూర్ వరకు పలు ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లను నర్సరీల ఏర్పాటు, మొక్కల విక్రయాల కోసం వినియోగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పాదచారులు నడవాల్సిన మార్గాలు వ్యాపార కార్యకలాపాలకు పరిమితం కావడంతో ప్రజలు రహదారులపైకి రావాల్సి వస్తోంది. దీంతో ప్రమాదాల ముప్పు పెరుగుతోంది. షాపింగ్‌కు వచ్చే వినియోగదారులకు పార్కింగ్ స్థలం లేకపోయినా, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు సాగించేందుకు ఎలా అవకాశం లభిస్తోందన్నది అధికారులే సమాధానం చెప్పాలి. కార్పొరేషన్ల టౌన్‌ప్లానింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ట్రాఫిక్ విభాగాలు సమన్వయంతో చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఆదేశాల అమలుపై ప్రత్యేక నిఘా అవసరం

ముఖ్యమంత్రి ఫిబ్రవరి 2026లో పారిశుద్ధ్యంపై నిర్వహించిన సమీక్షలో రహదారులపై చెత్త కనిపిస్తే అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. మార్చిలో మూడు కార్పొరేషన్ల పరిధిలో 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రతిరోజూ ఇంటింటికీ చెత్త సేకరణ, వాహనాల పర్యవేక్షణ, కొత్త డంపింగ్ యార్డుల ఏర్పాటు, నిర్మాణ వ్యర్థాల నిర్వహణపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అయినప్పటికీ అక్టోబర్ చివరిలో మల్కాజిగిరి కార్పొరేషన్ కమిషనర్ తనిఖీల్లోనే డ్యాష్‌బోర్డు లెక్కలకు, క్షేత్రస్థాయి పరిస్థితులకు మధ్య వ్యత్యాసాలు బయటపడటం అమలు తీరుపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది.

తెలంగాణ పొలిటికల్ గేమ్‌లో జగన్ దారెటు



హైదరాబాద్, తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిల మధ్య ఉన్న సాన్నిహిత్యం, ఆ రెండు పార్టీల మధ్య ఉన్న సత్సంబంధాలు అందరికీ తెలిసినవే. గడిచిన కొన్నేళ్లుగా ఒకరికొకరు నైతిక మద్దతు ఇచ్చుకుంటూ వచ్చారు. కానీ, మారిన తెలంగాణ రాజకీయ సమీకరణాల్లో భాగంగా కేటీఆర్ తీసుకుంటున్న కొత్త రాజకీయ వ్యూహం ఇప్పుడు పొరుగు రాష్ట్రంలో ఉన్న తన ఆప్తమిత్రుడు జగన్‌మోహన్ రెడ్డిని ఇరకాటంలో పడేస్తోంది. తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిందించడానికి కేటీఆర్ పదే పదే ఆంధ్రప్రదేశ్‌లోని చంద్రబాబు నాయుడు సర్కార్ పాలనను, అక్కడ జరుగుతున్న వాటర్ మేనేజ్‌మెంట్‌ని ప్రశంసించడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది.గతంలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో.. మా తెలంగాణలోనే సంక్షేమం, అభివృద్ధి వేగంగా సాగుతున్నాయి, పొరుగున ఉన్న ఏపీలో విద్యుత్ కోతలు, దారుణమైన రోడ్లు ఉన్నాయి అంటూ కేటీఆర్, ఇతర గులాబీ నేతలు పరోక్షంగా విమర్శించేవారు. అప్పుడు ఏపీలో సీఎంగా ఉన్నది తన మిత్రుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అయినప్పటికీ, తెలంగాణ మోడల్‌ను గొప్పగా చాటుకోవడానికే కేటీఆర్ ఏపీని తక్కువ చేసి మాట్లాడారు. ఇక ఇప్పుడు సీన్ తలకిందులైంది. తెలంగాణలో బీఆర్ఎస్ ప్రతిపక్షంలోకి రావడం, కాంగ్రెస్ ప్రభుత్వం పీఠం ఎక్కడంతో.. రేవంత్ రెడ్డి నమూనా ఎంత దారుణంగా ఉందో చూపించే క్రమంలో చూడండి, పక్క రాష్ట్రమైన ఏపీలోనూ ఎల్‌నినో ఉంది, కానీ అక్కడ చంద్రబాబు ప్రభుత్వం పరిస్థితులను ఎంత పక్కాగా మేనేజ్ చేస్తోంది! అంటూ చంద్రబాబు వైపు కితాబుల వర్షం కురిపిస్తున్నారు.ఈ వ్యూహంలో కేటీఆర్‌కు ఎలాంటి స్వార్థ రాజకీయ స్వార్థం లేకపోవచ్చు. కేవలం తెలంగాణ కాంగ్రెస్‌పై దాడి చేయడమే ప్రధాన ఉద్దేశం కావచ్చు. కానీ, కేటీఆర్ నోటి వెంట వస్తున్న ఈ మాటలు నేరుగా ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ రాజకీయ మనుగడకు, ప్రతిపక్ష పోరాటానికి పెను శరాఘాతంగా మారుతున్నాయి. ఏపీలో కూటమి ప్రభుత్వం దారుణంగా విఫలమైందని, కరవును ఎదుర్కోవడంలో చంద్రబాబు చేతులెత్తేశారని వైఎస్సార్సీపీ క్షేత్రస్థాయిలో ఆందోళనలు చేస్తుంటే.. తెలంగాణ నుంచి జగన్ మిత్రుడే అయిన కేటీఆర్ వచ్చి ఆంధ్రాలో చంద్రబాబు పాలన, వాటర్ మేనేజ్‌మెంట్ బాగుంది అని సర్టిఫికేట్లు ఇవ్వడం వైసీపీ ప్రచారానికి పూర్తిగా గొడ్డలిపెట్టులా మారుతోంది. టీడీపీ నేతలు, మద్దతుదారులు కేటీఆర్ కామెంట్లను ఆయుధంగా మలుచుకుని నెట్టింట విరుచుకుపడుతున్నారు. జగన్ నన్నిహితుడైన కేటీఆర్ కూడా కూటమి ప్రభుత్వ పాలనను మెచ్చుకుంటున్నారు, ఇక జగన్ చెప్పే కల్పిత విమర్శలను ఎవరు నమ్ముతారు? అంటూ సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోల్ చేస్తున్నారు. దీంతో ఏపీలో వైసీపీ నేతలు ప్రతిసారీ కేటీఆర్ వ్యాఖ్యలకు సమర్థన ఇచ్చుకోలేక, అలాగని మిత్రుడిని విమర్శించలేక తీవ్ర మానసిక మథనానికి గురవుతున్నారు. జగన్‌ను కన్ఫ్యూజన్‌లో పడేస్తున్న ఈ కామెంట్లు వైఎస్సార్సీపీ క్యాడర్‌కు తీవ్ర నిరాశను కలిగిస్తున్నాయి.రాజకీయంలో శాశ్వత మిత్రులు, శత్రువులు ఉండరు అనే నానుడితో పాటు సొంత ఇంటి సంక్షోభం ముందర పొరుగువారి స్నేహం ద్వితీయమే అనే సూత్రం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోంది. కేటీఆర్‌కు ఇప్పుడు తెలంగాణలో రేవంత్ రెడ్డిని దెబ్బతీయడం, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను మళ్లీ బలమైన పునాదిపై నిలబెట్టడం మాత్రమే ఏకైక ప్రాధాన్యత. అందుకోసం వైరి వర్గమైన చంద్రబాబునైనా సరే మెచ్చుకోవడానికి ఆయన వెనుకాడటం లేదు. ఈ క్రమంలో తన మిత్రుడు జగన్‌కు రాజకీయంగా ఎంత నష్టం జరుగుతోందనే అంశాన్ని కేటీఆర్ పూర్తిగా పక్కన పెట్టేసినట్లే కనిపిస్తోంది. తమ సొంత ప్రయోజనాలు, రాజకీయ వ్యూహాల కోసమే కేటీఆర్ ఆంధ్రాను వాడుకుంటుండటంతో, స్నేహానికి-రాజకీయ అవసరాలకు మధ్య ఉన్న స్పష్టమైన సరిహద్దులు బయటపడ్డాయి. మిత్రుడి ఇబ్బందులను పక్కనపెట్టి కేటీఆర్ సాగిస్తున్న ఈ సెల్ఫ్-పొలిటికల్ గేమ్ రాబోయే రోజుల్లో జగన్-కేటీఆర్‌ల చెలిమిపై ఎలాంటి ప్రభావం చూపుతుందో, ఏపీ రాజకీయాల్లో వైఎస్సార్సీపీ దీనికి ఎలా కౌంటర్ ఇస్తుందో వేచి చూడాలి.

స్వచ్ఛంద ఉద్యమం చేపట్టనున్న ధనుష్..

చెన్నై: కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ గురించి ఇప్పుడు ఓ ఆసక్తికర విషయం ఫిల్మ్ వర్గాలతోపాటు సోషల్ మీడియాలోనూ సంచలనం సృష్టిస్తుంది. తన అభిమాన సంఘాన్ని ఇకపై స్వచ్ఛంద సంస్థగా మార్చనున్నట్లు ప్రచారం నడుస్తుంది. త్వరలోనే రాజకీయంలోకి అడుగుపెట్టనున్నట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో భవిష్యత్తులో తలెత్తే ఏవైనా న్యాయపరమైన సమస్యలను పరిష్కరించడానికి దాదాపు 3వేల మంది న్యాయ సలహాదారులను నియమించనున్నట్లు తెలుస్తోంది. తమిళనాడు రాజకీయాల గురించి ఇప్పుడు ఆసక్తికర చర్చ నడుస్తుంది. ఇటీవలే సొంతంగా పార్టీ ప్రారంభించి అఖండమైన మేజారిటీతో గెలిచి ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు విజయ్ దళపతి. ఇప్పుడు ఆయన దారిలో మరో హీరో ధనుష్ సైతం నడుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ హీరో త్వరలోనే రాజకీయ ప్రవేశం చేయనున్నారనే ప్రచారం తమిళనాడు సినీ వర్గాల్లో జోరుగా సాగుతుంది. ఇప్పటివరకు ఈ విషయం పై అధికారిక ప్రకటన రాకపోయినప్పటికీ నెట్టింట మాత్రం రోజుకో వార్త హల్చల్ చేస్తుంది. ఈ క్రమంలోనే తాజాగా మరో న్యూస్ అందరి దృష్టిని ఆకర్షిస్తుంది. ప్రస్తుతం వినిపిస్తున్న టాక్ ప్రకారం ధనుష్ అభిమాన సంఘాన్ని స్వచ్ఛంద సంస్థగా మార్చి రాష్ట్ర వ్యాప్తంగా 3 వేల మంది న్యాయసలహాదారులను నియమించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఆన స్వచ్ఛంద సంస్థ 234 నియోజకవర్గాల కోసం ఏసీ సౌకర్యాలతో కూడిన ట్యూషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతుందని ప్రచారం జరుగుతుంది.అభిమాన సంఘం ఒక స్వచ్ఛంద సంస్థగా రూపాంతరం చెందుతున్న నేపథ్యంలో, రాజకీయ మార్గంలో భవిష్యత్తులో తలెత్తే న్యాయపరమైన సమస్యలను పరిష్కరించడానికి ఈ న్యాయ సలహాదారులను నియమించనున్నట్లు సమాచారం. మొత్తం 234 నియోజకవర్గాల్లోనూ వీరిని నియమిస్తే, ప్రతి నియోజకవర్గానికి పెద్ద సంఖ్యలో న్యాయ సలహాదారులు అందుబాటులో ఉంటారని అంటున్నారు. భవిష్యత్తులో ధనుష్ స్వచ్ఛంద సంస్థ కార్యనిర్వాహకులపై ఉన్న కేసులను పరిష్కరించడంలో, నిరసనల సమయంలో తలెత్తే చట్టపరమైన సమస్యలలో, స్థానిక సమస్యలలో వారు సహాయపడవచ్చని రాజకీయ వర్గాలలో చర్చ జరుగుతోంది. ఇటీవల, ధనుష్ స్వచ్ఛంద సంస్థ వరుసగా అనేక చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా, అక్టోబర్ 15, 2026న, ఫ్యాన్ క్లబ్‌ను స్వచ

ఒక్క వానకే హైదరాబాద్ చెరువుల కళకళ..



హైదరాబాద్,ఒకప్పుడు మురుగుతో నిండి.. కబ్జాల కోరల్లో చిక్కుకుని ఉ పిరిసలుపుకోని ఆ చెరువులు.. నేడు హైడ్రా సంకల్ప బలం.. ఒకే ఒక్క వాన ధాటికి సరికొత్త జీవనాన్ని సంతరించుకున్నాయి. ఎండిపోయిన జూడ నుంచి స్వచ్ఛమైన జలకళతో తొణికిసలాడుతూ నగర ప్రజల దాహార్తిని తీర్చే అమృత ధారలుగా మారుతున్న ఆ జలాశయాల విజయగాథే ఈ నేటి చారిత్రక పరిణామం. ఎల్‌నినో ప్రభావంతో వాన చినుకు కోసం ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నగర ప్రజలకు వరుణుడు ఎట్టకేలకు కరుణించాడు. శు క్రవారం కురిసిన సుమారు 7 సెంటీమీటర్ల భారీ వర్షం హైదరాబాద్ వాసుల మోములపై చిరునవ్వులు పూయించింది. ముఖ్యంగా మాదాపూర్‌లోని సున్నం చెరువు , తమ్మిడికుంట జలాశయాలు వర్షపు నీటితో కళకళలాడుతుండటం స్థానికుల్లో అమితానందాన్ని నింపుతోంది. ఒకప్పుడు ఈ చెరువుల పరిస్థితి చూస్తే కన్నీళ్లే మిగిలేవి. మురుగు నీరు.. భారీగా పేరుకుపోయిన పూడిక.. కబ్జాల కోరల్లో చిక్కుకుని ఆ చెరువులు దుర్గంధం వెదజల్లాయి. నీటి జాడ లేక ఎండిపోయి వెలవెలబోయిన ఆ జలాశయాలను చూసి స్థానికులు ఆవేదన చెందేవారు. కానీ నేడు ఆ దృశ్యాలు పూర్తిగా మారిపోయాయి. నగరంలోని చెరువులను కాపాడేందుకు 'హైడ్రా' చేపట్టిన సంకల్పం ఇప్పుడు సత్ఫలితాలను ఇస్తోంది. సున్నం చెరువులో దశాబ్దాలుగా పేరుకుపోయిన 10 నుంచి 15 అడుగుల పూడికను హైడ్రా తొలగించింది. ఆక్రమణలను అడ్డుకోవడంతో పాటు.. చుట్టూ వాకింగ్ పాత్‌వేలు, పిల్లల కోసం ఆటస్థలాలు, పూలు, మొక్కలతో ఆ ప్రాంతాన్ని ఒక సుందరమైన పర్యావరణ కేంద్రంగా తీర్చిదిద్దింది. అయితే చెరువులను అందంగా చేయడం ఎంత ముఖ్యమో.. వాటిలోకి వర్షపు నీరు చేరేలా చేయడం అంతకంటే ముఖ్యం. ఈ వాస్తవాన్ని గుర్తించిన హైడ్రా అధికారులు.. రోడ్లపై వృథాగా పారే వర్షపు నీరు నేరుగా చెరువులోకి చేరేలా ప్రత్యేకంగా 'ఇన్‌లెట్లను' ఏర్పాటు చేశారు. ఇప్పుడు అదే ఇన్‌లెట్లు ఆ ప్రాంతానికి జీవనాధారంగా మారాయి. శుక్రవారం కురిసిన భారీ వర్షానికి రోడ్లపై ప్రవహించాల్సిన నీరంతా నేరుగా సున్నం చెరువులోకి పరుగులు పెట్టింది. ఈ అద్భుత దృశ్యాన్ని చూసేందుకు స్థానికులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఇళ్ల నుంచి బయటకు వచ్చారు. తమ కళ్ల ముందే చెరువు నీటితో నిండుతుండటం చూసి పరవశించిపోయారు. కొందరైతే ఈ ఆనంద క్షణాలను వీడియోలు తీసి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌కు పంపి తమ కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం కానున్న ఈ చెరువులు, ప్రారంభోత్సవానికి ముందే జలకళ సంతరించుకోవడం శుభపరిణామమని స్థానికులు ఉప్పొంగిపోతున్నారు. ఈ వర్షపు నీరు చెరువులో నిలవడం వల్ల కేవలం అందం మాత్రమే కాదు.. వేలాది మందికి తాగునీటి భద్రత చేకూరుతుంది. ఎండిపోయిన బోర్లు మళ్లీ ఊపిరి పీల్చుకుంటాయని.. భూగర్భ జలాలు గణనీయంగా పెరుగుతాయని ప్రజలు గట్టిగా నమ్ముతున్నారు. "చెరువులు బతికితేనే నగరానికి భవిష్యత్తు" అనే నినాదానికి హైడ్రా చేపట్టిన ఈ పునరుద్ధరణ పనులు నిజ రూపం ఇస్తున్నాయి. మురుగు కూపాలుగా ఉన్న జలాశయాలు స్వచ్ఛమైన వర్షపు జలాలతో కళకళలాడుతుంటే.. హైదరాబాద్ భవిష్యత్తుపై భరోసా కలుగుతోంది.

కూటమి విజయాల వెనుక సైలెంట్ స్కెచ్ నారా లోకేష్‌దే !



అమరావతి,స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే ముందస్తు సమయం నుంచి దాదాపు పది రోజుల పాటు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్ ఎక్కడా బహిరంగంగా కనిపించకపోవడంపై కొద్దిరోజుల క్రితం సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు, చర్చలు సాగాయి. క్షేత్రస్థాయి ప్రచారాల్లో ఆయన కనిపించకపోవడంతో ప్రత్యర్థులు దీనిపై రకరకాల వ్యాఖ్యానాలు చేశారు. అయితే, ఆ నిశ్శబ్దం వెనుక ఎంతటి పకడ్బందీ వ్యూహం దాగి ఉందో తెలిసిన వారికి మాత్రం అది ఆశ్చర్యం కలిగించలేదు. కెమెరాల ముందుకు రాకుండా నారా లోకేష్ రహస్య వార్ రూమ్‌లో కూర్చుని.. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాల్సిన ఎన్నికల మిషన్‌ను సూక్ష్మస్థాయిలో సిద్ధం చేయడంలోనే ఆ సమయాన్ని పూర్తిగా వెచ్చించారు. ప్రచార ఆర్భాటాల కంటే కూడా ఫలితాలను శాసించే సంస్థాగత ఎలక్షనీరింగ్ వ్యూహాన్ని రూపొందించడమే లక్ష్యంగా ఆయన తెరవెనుక మంత్రాంగం నడిపించారు.

నారా లోకేష్ వార్ రూమ్ కసరత్తు సీక్రెట్

సాధారణంగా ఎన్నికలంటే సభలు, రోడ్‌షోలు, మైకుల హోరు మాత్రమే అనుకునే వారికి.. అధునిక రాజకీయాల్లో డాటా సైన్స్, క్షేత్రస్థాయి మేనేజ్‌మెంట్ ఎంతటి కీలక పాత్ర పోషిస్తాయో లోకేష్ కార్యాచరణ స్పష్టం చేసింది. ప్రతి మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ, నగర పంచాయతీల వారీగా స్థానిక సమీకరణాలను బేరీజు వేస్తూ అభ్యర్థుల ఎంపికలో ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. కూటమి భాగస్వామ్య పక్షాలైన జనసేన, బీజేపీలతో ఎక్కడా విభేదాలు రాకుండా సీట్ల సర్దుబాటు రూట్ మ్యాప్ తయారు చేయడం, బూత్ స్థాయి కమిటీలను అప్రమత్తం చేయడం, ఓటర్ల చేరికలు-జాబితాల పరిశీలన వంటి క్లిష్టమైన ప్రక్రియలను వార్ రూమ్ నుంచే స్వయంగా పర్యవేక్షించారు. ప్రణాళిక రచన మొదలుకుని అమలు వరకు ప్రతి అడుగూ పక్కాగా సాగిపోయేలా డిజిటల్ నెట్‌వర్క్‌ను అనుసంధానించారు.

క్లీన్ స్వీప్ వెనుక మాస్టర్ ప్లానే కీలకం

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి నమోదు చేసిన చారిత్రాత్మక క్లీన్‌స్వీప్ వెనుక లోకేష్ అమలు చేసిన ఈ మాస్టర్ ప్లాన్ అత్యంత కీలకంగా నిలిచింది. క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్ మధ్య ఎలాంటి గందరగోళం లేకుండా ఓట్ ట్రాన్స్‌ఫర్ విజయవంతంగా జరగడం, జెన్-జీ సహా కొత్త ముఖాలకు టిక్కెట్లు దక్కడం, అసమ్మతి తలెత్తిన చోట తక్షణమే సమన్వయం కుదరడం.. ఇవన్నీ లోకేష్ వార్ రూమ్ వ్యూహాల ఫలితమేనని స్పష్టమవుతోంది. ప్రత్యర్థులు అనవసర రాజకీయ విమర్శలు, వివాదాల్లో మునిగిపోయిన వేళ.. నిశ్శబ్దంగా తన పని తాను చేసుకుంటూ ఎన్నికల యంత్రాంగాన్ని విజయతీరాలకు నడిపించడంలో ఆయన ప్రదర్శించిన వ్యూహాత్మక చాతుర్యం ప్రతిపక్షాలకు కనీసం కోలుకునే అవకాశం కూడా ఇవ్వలేదు.

ఫలితమే మాట్లాడాలి!

మైకుల ముందు హంగామా చేసే నాయకులు కొందరైతే.. తెరవెనుక ఉండి మొత్తం రాజకీయ ముఖచిత్రాన్ని తిరగరాయగల వ్యూహకర్తలు అరుదుగా ఉ ంటారు. ఆ కోణంలో చూస్తే కూటమి సాధించిన ఈ అఖండ మున్సిపల్ విజయం లో నారా లోకేష్ నిజమైన సైలెంట్ హీరో గా నిరూపించుకున్నారు. గతంలో అసెంబ్లీ ఎన్నికల నాటి నుంచే పార్టీ ఎన్నికల వ్యూహాలను కార్పొరేట్ స్థాయిలో నడిపిస్తూ వస్తున్న ఆయన.. ఈ స్థానిక పోరులోనూ తనదైన ఎలక్షనీరింగ్ ముద్ర వేసి తిరుగులేని ఫలితాన్ని రాబట్టారు. ప్రచారం లేకపోయినా ఫలితాలే మాట్లాడాలన్నట్లుగా లోకేష్ సాగించిన ఈ నిశ్శబ్ద మిషన్.. భవిష్యత్ ఎన్నికల సమరాలకు కూడా కూటమికి ఒక తిరుగులేని విజయ నమూనాగా నిలిచింది.

కమలానికి దగ్గరవుతున్నచిరంజీవి



హైదరాబాద్,మెగాస్టార్ చిరంజీవి సినీ రంగంలో అందరి వాడు. పరిశ్రమకు పెద్ద దిక్కు ఆయన పెద్దరికం మీద అందరికీ నమ్మకం ఉంది. అనేక సమస్యలను ఆయన పరిష్కరిస్తూ వస్తున్నారు. ఇక చిరంజీవి స్వభావానికి రాజకీయాలు పడవని సన్నిహితులు అంటారు. ఆయన మెత్తని స్వభావం కలిగిన వారు. అందుకే ఆయన రాజకీయాల్లోకి ఎంత తొందరగా వెళ్లాలో అంతే వేగంగా వెనక్కి తిరిగారు. అది కూడా ఎలాంటి విమర్శలు పెద్దగా లేకుండానే గౌరవంగా తప్పుకున్నారు. ఇక తన జీవితం అంతా సినిమాలకే అంకితం అని ఆయన పదే పదే అనేక సార్లు చెప్పి ఉన్నారు. అయినా సరే మెగాస్టార్ చుట్టూ ఎపుడూ రాజకీయ ఊహాగానాలు వినిపిస్తూనే ఉంటాయి. ఆయన విషయంలో మరోసారి అలాంటి వార్తలే ప్రచారంలో ఉంటూ వస్తున్నాయి. అమిత్ షాతో భేటీ : ఇదిలా ఉంటే హైదరాబాద్ పర్యటనకు వచ్చిన కేంద్ర హోంమంత్రి బీజేపీ అగ్ర నేత అమిత్ షాను మెగాస్టార్ చిరంజీవి ఆయన కుమారుడు రామ్ చరణ్ తో పాటుగా వెళ్ళి కలిశారు. ఇది మర్యాదపూర్వకమైన భేటీ అని చెబుతున్నా కూడా చిరంజీవి రాజకీయం గురించి మరోసారి చర్చించే విధంగా వార్తా కథనాలు అల్లుతున్న వారూ ఉన్నారు. అయితే అమిత్ షాను కలిసిన ప్రముఖులలో అనేక రంగాలకు చెందిన వారు ఉన్నారు. అందులో మై హోం నుంచి రామేశ్వరరావు, అలాగే ఒక ప్రముఖ తెలుగు టీవీ చానెల్ అధినేత ఇంకా అనేక మంది ఉన్నారు. అయితే అందరి దృష్టి మాత్రం మెగాస్టార్ మీదనే ఉంది. ఎందుకంటే ఆయన సినీ దిగ్గజం, కేంద్ర మాజీ మంత్రి, అంతే కాదు జనసేన అధినేత పవన్ కి సోదరుడు కాబట్టి అని అంటున్నారు. ఇక పవన్ ఏపీలో కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం గా ఉన్నారు. ఆ కూటమిలో బీజేపీ కూడా ఉంది. అలా ఆ బంధాన్ని కూడా కలుపుతూ చిరంజీవి రాజకీయాల మీద చర్చించే వారూ ఉ న్నారు. అయితే అమిత్ షాని చిరంజీవి కలవడం వెనక రాజకీయం లేదని అంటున్నారు. కేవలం మర్యాదపూర్వకమైన భేటీ అని చెబుతున్నారు. ఈ సందర్భంగా టాలీవుడ్ సినీ రంగం పరిస్థితులలో పాటు తమ సినిమాల గురించి చర్చకు వచ్చినట్లుగా చెబుతున్నారు. ఇక చిరంజీవి విషయానికి వస్తే ఆయన రాజకీయంగా అందరి వాడుగా ఉన్నారని గుర్తు చేస్తున్నారు. ఆయనకు పార్టీలతో సంబంధం లేదని కూడా అంటున్నారు. ఏపీలో ఈ మధ్య పర్యటించిన మెగాస్టార్ కూటమి ప్రభుత్వం పాలన బాగుందని చెప్పారని అంటున్నారు. అలాగే రేవంత్ రెడ్డితో కూడా అనేక వేదికలు పంచుకున్నారని అంటున్నారు. ఇలా అందరి వాడుగా ఉంటూ వస్తున్న చిరంజీవి రాజకీయాలలో క్రియాశీలకం అవుతారు అన్నది కేవలం ఊహాగానాలే అని అంటున్నారు.అయితే కమలం పార్టీకి ఆశలు మాత్రం ఉన్నాయని అంటున్నారు. ఇప్పటికే పవన్ కళ్యాణ్ కూటమిలో ఉ న్నారు. చిరంజీవి వంటి బిగ్ ఫిగర్ కనుక తమతో ఉంటే తెలంగాణాలో కూడా అధికారానికి మరింత సులువు అవుతుందన్న లెక్కలు బీజేపీకి ఉన్నాయని చెబుతున్నారు. అయితే చిరంజీవి తిరిగి రాజకీయాల్లోకి వస్తారా అంటే అది ఈజీ కాదు కదా అసలు కుదిరే వ్యవహారం కానే కాదని అంటున్నారు. ఒక విధంగా చిరంజీవి రాజకీయం అన్నది ముగిసిన అధ్యాయం అని కూడా అంటున్నారు. అయితే కాలం ఎపుడూ గొప్పది చూడాలి మరి ఊహాగానాలు అలాగే ఉంటాయా లేక ఏమవుతాయి అన్నది.

పట్టణ రిజల్ట్...పరిషత్తులలో రిపీట్ ?



విజయవాడ:ఏపీలో ఈ నెల 5న జెడ్పీటీసీ ఎంపీటీసీలకు ఎన్నికలు జరగబోతున్నా యి. ఈ ఎన్నికలకు సంబంధించి మంగళవారం సాయంత్రం నాలుగు గంటలతో ప్రచారం ముగిసింది. ఏపీలో ఆరు వందలకు పై చిలుకు జెడ్పీటీసీ అలాగే వేలాది ఎంపీటీసీలకు ఎన్నికలు జరగబోతున్నాయి. ఇక ఎన్నికల షెడ్యూల్ ప్రకారం చూస్తే ఏపీలో మొత్తం 659 జెడ్పీటీసీ స్థానాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. అయితే ఇందులో 77 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 582 స్థానాలకు నవంబర్ 5న పోలింగ్ నిర్వహించనున్నారు. అలాగే ఎంపీటీసీ స్థానాలు మొత్తం 9,829 ఉంటే అందులో 1,985 స్థానాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. మిగిలిన 7,844 స్థానాలకు ఎన్నికల పోరు జరగనుంది.

మునిసిపోల్స్ ప్రభావం :

రెండు రోజుల వ్యవధిలో పరిషత్తు ఎన్నికలు జరుగుతాయి అనగా కార్పోరేషన్ మునిసిపాలిటీల రిజల్ట్స్ వచ్చాయి. అన్నింటా కూటమి స్వీప్ చేసేసింది. వైసీపీకి పెద్దగా సీన్ లేదని ఈ ఫలితాలు తేల్చేశాయి. ఇపుడు పరిషత్తు ఎన్నికలు ఉ న్నాయి. నిజానికి రూరల్ బేస్డ్ గా జరిగే ఈ ఎన్నికల మీద వైసీపీ ఎక్కువ ఆశలు పెట్టుకుంది అని అంటున్నారు. గ్రామీణ నేపథ్యంలో వైసీపీకి బలం ఉ ందని తమ ఓటర్లు ఎక్కువగా రూరల్ సెక్టార్ లోనే ఉన్నారు అని వైసీపీ నేతలు చెబుతారు. అయితే లేటెస్ట్ గా అర్బన్ బాడీస్ కి వచ్చిన ఫలితాలు రూరల్ లో కూడా ప్రభావం గట్టిగా చూపుతాయని అంటున్నారు. పైగా కూటమి పటిష్టంగా ఉందని తేలిపోయింది. అంతే కాదు స్థానిక ఎన్నికల్లో జనం మూడ్ అర్బన్ రూరల్ అన్న తేడా లేకుండా ఒకే విధంగా ఉంటుందని అంటున్నారు. ఇక అధికారంలో ఉన్న పార్టీకే జనాలు మద్దతు ఇస్తారు. అలా ఇవన్నీ చూసుకుంటే కచ్చితంగా అర్బన్ రిజల్ట్ రూరల్ లో రిపీట్ అవుతుందని అంటున్నారు.

వైసీపీ ఆశలు :

అయితే దీనిని వైసీపీ పూర్తిగా అంగీకరించడం లేదని అంటున్నారు. రూరల్ లో సీన్ వేరేగా ఉంటుందని చెబుతున్నారు. తాము మెరుగైన ఫలితాలు సాధిస్తామని చెబుతున్నారు. మరీ గ్రౌండ్ లెవెల్ లోకి వెళ్ళి జనం నాడిని పట్టుకునే ఈ ఫలితాలు తమకు అనుకూలంగానే ఉంటాయని ఆ పార్టీ అంటోంది. అదే విధంగా చూస్తే వేలాది ఎంపీటీసీలు ఉన్నాయి. దాంతో ఓటర్లు తక్కువ ఉ ంటారు, అలాంటి వేళ సింగిల్ డిజిట్ తోనే రిజల్ట్ తారు మారు అవుతుందని అంటున్నారు. ఎక్కువ మంది అభ్యర్థులు ఉంటే కూటమిలో కో ఆర్డినేషన్ కి కూడా అది పరీక్ష గా మారుతుందని అంటున్నారు. ఇలా వైసీపీ ఆలోచనలు ఉ ంటే ఏపీ మొత్తం ఒక యూనిట్ గానే ఉంటుందని ఈ తేడాలు కనిపించవని ఒకే ఫలితం ఇచ్చాపురం నుంచి అనంతపురం దాకా ఉంటుందని రేపటి పరిషత్తు ఎన్నికల్లో అదే జరిగి తీరుతుందని కూటమి నేతలు ధీమాగా చెబుతున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

మురసు తుపాను ప్రభావంతో పల్నాడు జిల్లాలో భారీ వర్షాలు

చిలకలూరిపేట:పట్టణంలో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. జాతీయ రహదారిని వరద ముంచెత్తడంతో పాటు, పలుచోట్ల విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. అయితే, అధికారులు ముందుజాగ్రత్త చర్యగా విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.మరోవైపు, విజయవాడ నగరాన్ని కూడా వర్షం ముంచెత్తింది. గత 10 గంటలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వానతో నగరంలోని అనేక కాలనీలు, బస్తీలు జలమయమయ్యాయి.

జగన్ కు ఊపిరిచ్చిన ఎన్నికలు



అనంతపురం, ఆంధ్రప్రదేశ్ లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో జగన్ వ్యూహం ఒకరకంగా విజయవంతమయినట్లేనని చెప్పాలి. ఎందుకంటే గత ఎన్నికల తరహాలో ఎన్నికలను బహిష్కరించకుండా క్యాడర్ లను, లీడర్లను ఎన్నికల బరిలోకి దింపడంతో ఒకరకంగా జగన్ సక్సెస్ అయినట్లే. తన క్యాడర్ ను పార్టీ జెండా పట్టుకుని వచ్చే సాధారణ ఎన్నికల వరకూ పోరాడగలిగేలా జగన్ ఈ ఎన్నికల ద్వారా సమాయత్తం చేయగలిగారు. నామినేషన్ల పర్వం నుంచి మొదలయిన రగడతో క్యాడర్ స్ట్రాంగ్ గా మారింది. ఎన్నికల ఫలితాల్లో గెలుపోటములతో సంబంధం లేకుండా, క్షేత్రస్థాయిలో పార్టీ ఉనికిని చాటుకోవడం మరియు క్యాడర్‌ను యాక్టివ్ చేయడంలో ఈ ఎన్నికలు కీలక పాత్ర పోషించాయని విశ్లేషకులు భావిస్తున్నారు. గత సాధారణ ఎన్నికల్లో వైసీపీ కేవలం పదకొండు స్థానాలకే పరిమితం కావడంతో క్యాడర్, లీడర్లలో నైరాశ్యం నిండుకుంది. కొందరయితే పార్టీని వీడి వెళుతున్న వారు, మరికొందరు తమ ఇళ్లకే పరిమితమయిన వారిలో ఫ్యాన్ పార్టీ ఉక్కపోతకు గురయిందని చెప్పాలి. అయితే స్థానిక సంస్థల ఎన్నికలను జగన్ చక్కగా వినియోగించుకున్నాడనిపిస్తోం ది. స్తబ్దుగా ఉన్న క్యాడర్, లీడర్లలో ఆత్మస్థయిర్యం నింపింది. కొన్ని చోట్ల ప్రజలు వైసీపీకి పట్టం కట్టడంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం కూటమికి ఏకపక్షం కాదని ఈ ఎన్నికల ద్వారా జగన్ రుజువు చేసినట్లయింది. సార్వత్రిక ఎన్నికల ఓటమి తర్వాత స్తబ్దుగా ఉన్న పార్టీ శ్రేణుల్లో ఈ ఎన్నికలు కొత్త ఉ త్సాహాన్ని నింపాయి. నాయకత్వం అండగా ఉంటుందనే నమ్మకాన్ని జగన్ కల్పించగలిగారు. పార్టీలోని అగ్రనాయకులు, ద్వితీయ శ్రేణి నాయకులు మరియు కార్యకర్తలు అంతా కలిసికట్టుగా పోరాడాల్సిన అవసరాన్ని ఈ ఎన్నికలు గుర్తుచేశాయి. దీనివల్ల అంతర్గత విభేదాలు పక్కన పెట్టి అందరూ ఏకమయ్యే పరిస్థితి వచ్చింది.? పోరాట పటిమను చాటడం: ఓటమిని చూసి కుంగిపోకుండా, అధికార పక్షాన్ని ఎదుర్కొంటూ ఎన్నికల బరిలో నిలవడం ద్వారా వైసీపీ తన ఉనికిని బలంగా చాటుకోగలిగింది. స్థానిక సంస్థల ఎన్నికల ద్వారా క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని పునర్నిర్మించుకోవడానికి, లోపాలను సరిదిద్దుకోవడానికి జగన్‌కు ఒక మంచి అవకాశం లభించింది.రాజకీయాల్లో గెలుపు ఎంత ముఖ్యమో... ఓడినప్పుడు క్యాడర్ చేజారిపోకుండా కాపాడుకోవడం కూడా అంతే ముఖ్యం. ఆ కోణంలో చూస్తే, క్లిష్ట పరిస్థితుల్లో కూడా లీడర్లను, క్యాడర్‌ను ఏకతాటిపైకి తీసుకురావడంలో జగన్ వ్యూహం విజయవంతమైందని చెప్పవచ్చు.ఎన్నికల్లో ఓటమి ఎదురైనప్పటికీ, పార్టీ శ్రేణులు మరియు నాయకత్వం కలిసికట్టుగా ఉండటం జగన్ మోహన్ రెడ్డి సాధించిన విజయంగా కొందరు భావిస్తున్నారు. మున్సిపల్ ఎన్నికల ఫలితాలపై వైసీపీ అధినేత జగన్ ట్వీట్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో చంద్రబాబు టీమ్, పోలీసులు, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ కు అభినందనలు తెలిపారు. నామినేషన్ల నుంచి పోలింగ్ వరకూ అంతా హైజాక్ చేశారని జగన్ ట్వీట్ లో పేర్కొన్నారు. ఇది ఎన్నిక కాదని... ఇది ఎన్నిక కాదని, అధికార పార్టీ ఎంపిక మాత్రమేనని వైఎస్ జగన్ అన్నారు. ప్రజలు అభ్యర్థులను ఎన్నుకోలేదని, ఎంపిక మాత్రమేనని అన్నారు. ప్రతిపక్షానికి పోటీ చేసే అవకాశమే దక్కినవ్వకుండా అధికార పార్టీ ఈ విజయాన్ని అందిపుచ్చుకుందని జగన్అన్నారు. ప్రతిపక్షానికి అవకాశమివ్వకుండా అధికారాన్ని చేజిక్కించుకోవడం ఎలాగో నిరూపించారు.క్లిష్ట సమయాల్లో కూడా క్షేత్రస్థాయిలో పార్టీ పట్టు కోల్పోకుండా, భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావడంలో నాయకత్వం విజయవంతమైందని ఈ వర్గం విశ్లేషిస్తుంది. భేదాభిప్రాయాలు మరియు సవాళ్లను ఎత్తిచూపే వాదన: మరోవైపు, ఎన్నికల తర్వాతి పరిణామాలలో కొందరు కీలక నాయకులు పార్టీని వీడటం లేదా క్రియాశీల రాజకీయాలకు దూరం కావడం వంటి అంశాలను మరికొందరు గుర్తుచేస్తున్నారు. పార్టీని తిరిగి బలోపేతం చేయడానికి మరియు క్యాడర్‌లో పూర్తిస్థాయి నమ్మకాన్ని నింపడానికి ఇంకా చాలా శ్రమించాల్సి

ఉందనే అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

జగన్ ఇలాకాలో ఓటమి

కడప జిల్లాలో వైసీపీకి ఘోర పరాజయం దక్కింది. మొత్తం ఎనిమిది మున్సిపాలిటీల్లో వైసీపీ ఓటమి చవి చూసింది. ఉమ్మడి కడప జిల్లాలో దాదాపు అన్ని మున్సిపాలిటీల్లో వైసీపీ ఓటమి పాలయింది.

ఏపీలో రాహుల్ ప్లాన్ ఏంటి...



విజయవాడ, నవంబర్ 4, మొత్తం మీద కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఒక విషయంలో విజయం సాధించారు. ప్రధాని కాలేకపోయిన ఆయన విపక్షాలను ఏకతాటిపైకి తెచ్చి బలమైన ప్రతిపక్ష నాయకుడుగా మారారు. అది తాజాగా ఢిల్లీలోని రామ్ లీలా మైదానంలో కళ్ళకు కట్టినట్లుగా కనిపించింది. రాహుల్ నాయకత్వం మీద మొదట్లో సందేహాలు వ్యక్తం చేసిన పార్టీలు కూడా భుజం కలిపి నడిచాయి. అంతా కలసి ఐక్యతను చాటాయి. దాంతో రాహుల్ కేంద్ర బిందువుగా మారారు. ఇక ఉత్తరాదిలో యూపీ నుంచి సమాజ్ వాది పార్టీతో కాంగ్రెస్ కి దోస్తీ ఉంది. అలాగే బీహార్ లో ఆర్జేడీతో పొత్తు ఉంది. పశ్చిమ బెంగాల్ లో మమతా బెనర్జీ ఓటమి తరువాత కాంగ్రెస్ తో మరింత సాన్నిహిత్యం నెరపుతున్నారు. మహారాష్ట్రలో ఉద్ధవ్ ఠాక్రే శివసేన మరో వైపు ఎన్సీపీ శరద్ పవార్ పార్టీతో చెలిమి చేస్తూ బలంగానే ఉంది. గుజరాత్ రాజస్థాన్, మధ్యప్రదేశ్ ఢిల్లీ పంజాబ్ వంటి చోట్ల కాంగ్రెస్ బలంగానే ఉంటూ తన పోరాటం సొంతంగా సాగిస్తోంది.ఇక దక్షిణాదిన మొదటి నుంచి కాంగ్రెస్ బలంగానే ఉ ంది. కర్ణాటక తెలంగాణాలలో సొంతంగానే అధికారంలోకి వచ్చింది. కేరళలో ఇటీవల పవర్ ని అందుకుంది. తమిళనాడులో ఆరు దశాబ్దాల తరువాత ప్రభుత్వంలో చేరింది. రెండు మంత్రి పదవులు కూడా తీసుకుంది. సినీ దళపతి విజయ్ స్థాపించిన టీవీకేతో కొత్త స్నేహం నెరిపి దక్షిణాదిన అయిదింట నాలుగు రాష్ట్రాలలో తన హవాను స్పష్టం చేస్తోంది. అన్నీ బాగానే ఉన్నా మొదటి నుంచి కాంగ్రెస్ కి పెట్టని కోటగా ఉన్న ఏపీని ఎందుకు వదిలేస్తోంది అన్నదే చర్చగా ఉంది. దేశంలో ఓట్ల చోరీ అంటూ కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ ఉద్యమిస్తున్నారు. మరి ఏపీలో కూడా ఈ ఉద్యమాన్ని ఎత్తుకుని అక్కడ విపక్ష భూమికను బలంగా ముందుకు తీసుకుని వెళ్ళే చాన్స్ ని ఎందుకు వదిలేస్తున్నారు అన్న చర్చ సాగుతోంది. ఇక స్థానిక సంస్థలకు ఎన్నికలు ప్రస్తుతం ఏపీలో జరుగుతున్నాయి. అన్ని పార్టీలు తమ శక్తి మేరకు బరిలో నిలబడి తలపడుతున్నాయి. ఇండిపెండెంట్లు కూడా అనేక చోట్ల జాతకాన్ని పరీక్షించుకుంటున్నాయి. అలాంటిది కాంగ్రెస్ అయితే ఎందుకో ఇంతటి సువర్ణ అవకాశాన్ని వదిలేసుకుంటోందా అన్న చర్చ సాగుతోంది. కాంగ్రెస్ కి గత మూడు ఎన్నికలూ దెబ్బేశాయి. డిపాజిట్లు గల్లంతు అయ్యాయి. కానీ కాలం ఎపుడూ ఒకేలా ఉ ండదు అంటారు. అలాంటిది ఏపీలో అధికార కూటమి విపక్ష వైసీపీలకే రాజకీయ మైదానం వదిలేసి కాంగ్రెస్ ఇంకా వేచి చూసే ధోరణిలో ఉందా అన్నదే అంతా ఆలోచిస్తున్నారు. వామపక్షాలను ఇతర పాటీలని కలుపుకుని ఫ్రంట్ గా కట్టి ముందుకు సాగితే స్థానిక ఎన్నికల్లో ఎన్నో కొన్ని సీట్లు అయినా దక్కుతాయని కదా అని అంటున్నారు. ఒక వేళ అలా కాకపోయినా కాంగ్రెస్ తన రాజకీయ ఉనికిని చాటుకునే విధంగా ఉండేది కదా అని కూడా అంటున్నారు. అయితే ఏపీ మీద మాత్రం కాంగ్రెస్ కి సరైన ప్లాన్స్ ఉన్నాయా లేవా అన్నదే ఇపుడు అంతా చర్చించుకుంటున్నారు. ఏపీలో ఎన్డీయే బలంగా ఉంది. విపక్షంలో వైసీపీ ఉంది. జగన్ ని కలుపుకుంటే: దాంతో కాంగ్రెస్ ఇక్కడ తన రాజకీయ విస్తరణకు కొత్త ఆలోచనలు చేయాల్సి ఉంది. దక్షిణాదిన అంతటా తన హవా ఉన్న కాంగ్రెస్ కి ఏపీలో ఆ పలుకుబడిని ఉపయోగించి ఎంతో కొంత ఎదగడం కష్టం కాదని అంటున్నారు. కానీ ఆ దిశగా ప్రయత్నాలు జరగకపోవడమే ఆశ్చర్యంగా ఉందని అంటున్నారు. ఏపీలో జగన్ ని కలుపుకుంటే ఇండియా కూటమికి దక్షిణాదిన మరింత బలం వస్తుందని అంటున్నారు. అయితే జగన్ వద్దు అన్నదే కాంగ్రెస్ ఆలోచనగా ఉందా అని కూడా ప్రశ్నలు వస్తున్నాయి. దాంతో ఏపీలో కాంగ్రెస్ ని బలోపేతం చేయడం కోసం రాహుల్ ప్లాన్ ఏంటి అన్నది అర్థం కావడం లేదని అంటున్నారు.

Edited, Printed, Published & owned by KOTAGIRI CHANDRA SHEKAR, Published From, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001, Printed at KOTAGIRI GRAPHICS & KOTAGIRI OFFSET PRINTER, H.NO.5-7-163 PRAKASHAM BAZAR, NALGONDA TOWN, TELANGANA- 508 001. Editor: KOTAGIRI CHANDRA SHEKAR, RNINo. TELTEL/2022/86880, Cell:9440164140